


నేడు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

నెల్లూరు (హరనాథపురం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతాయని జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో కనీసం 3 అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఈ ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, ఇంజనీరింగ్ అధికారులు ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

బదిలీల్లో మాయలు

జీవోకు విరుద్ధంగా పలు శాఖల్లో స్థానచలనాలు

నెల్లూరులోనే అటు, ఇటు తిప్పి జిమ్మిక్కులు



ఉద్యోగుల బదిలీల్లో అనేక చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. బలం ఉన్న వారికి ఒక రకంగానూ, బలహీనులకు మరోరకంగానూ స్థానచలనాలు జరుగుతున్నాయి. సాధారణ బదిలీలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలను స్పష్టంగా జీవోలో తెలియజేసినా కొన్ని శాఖల్లో వాటిని అతిక్రమించారు. ఒకే ఆఫీసు ప్రాంగణంలో అటు నుంచి ఇటు బదిలీ చేసి జిమ్మిక్కులు చేసిన వ్యవహారాలూ వెలుగులోకి వస్తున్నాయి. ఇక ఎమ్మెల్యేల సిఫారసు లేఖలకూ ప్రాధాన్యత ఇచ్చారు.

నెల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఐదేళ్ల ఒకేచోట సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులందరికీ బదిలీ తప్పనిసరి. అలానే ఐదేళ్లలోపు సర్వీసు ఉన్న వారు కూడా రిక్వెస్ట్ మీద బదిలీ కోరుకోవచ్చు. అయితే బదిలీ అనేది ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు జరగాలని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. స్టేషన్ అంటే ఒక సిటీ లేదా పట్టణం లేదా గ్రామం అని అర్థమని కూడా వివరణ ఇచ్చారు. ఒక స్టేషన్‌లో ఏ కేడర్‌లోనైనా ఐదేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులు, అధికారులను మరో స్టేషన్‌కు పంపాలి. కానీ కొన్ని శాఖల్లో స్టేషన్ అనే పదానికి అర్థం మార్చారు. ఉదాహరణకు ఇరిగేషన్ శాఖలోని సర్కిల్ కార్యాలయంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను సెంట్రల్ డివిజన్, డ్రైనేజీ డివిజన్‌కు బదిలీ చేశారు. అక్కడ పనిచేస్తున్న వారిని సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ కార్యాలయాన్నీ ఒకే ప్రాంగణంలో ఉంటాయి. అలానే రెవెన్యూ శాఖలో కూడా ఇదే తంతు జరిగింది. నెల్లూరు నగరంలో పనిచేసే ఉద్యోగులు కొందరిని అటు ఇటూ మార్చారు తప్ప నెల్లూరు దాటి పంపలేదు. పలు శాఖల్లో కూడా అధికారులు ఈ విధానాన్నే అనుసరించారు. కొందరు ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేసినా పట్టించుకోకపోవడం గమనార్హం. కాగా ఆర్‌అండ్‌బీలో ఐదేళ్ల సర్వీసు నిండిన వారిని బదిలీ చేయలేదని కొందరు ఉద్యోగులు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

● 'రెవెన్యూ'లో భారీగా...

సాధారణ బదిలీలకు ప్రభుత్వం ఇచ్చిన గడువు సోమవారంతో ముగిసింది. దీంతో రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. తహసీల్దార్ స్థాయి నుంచి వీఆర్వో స్థాయి వరకూ వందల మందికి స్థానచలనం కలిగింది. వీరిలో అనేక మంది ఎమ్మెల్యేల వద్ద సిఫారసు లేఖలు తెచ్చుకోవడం గమనార్హం. ఈ బదిలీల్లో గతేడాది సెప్టెంబరులో బదిలీ అయిన వారు కూడా ఉండడం విశేషం. మొత్తం 22 మంది తహసీల్దార్లు, మరో ముగ్గురు డిప్యూటీ తహసీల్దార్లకు అడహక్ తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి కల్పించి బదిలీ చేశారు. వీరితోపాటు 36 మంది డిప్యూటీ తహసీల్దార్లు, 11 మంది రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, 42 మంది సీనియర్ అసిస్టెంట్లు, 19 మంది జూనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు.

తహసీల్దార్ల బదిలీ వివరాలు...

తహసీల్దార్	ప్రస్తుతం	బదిలీ
కే అనీల్‌కుమార్	నెల్లూరు (డీఎస్వో)	ఏఎస్‌పేట
సీహెచ్ సుబ్బయ్య	మనుబోలు	కోవూరు
ఏ నిర్మలానందబాబా	కోవూరు	నెల్లూరు (డీఎస్వో)
ఎం సుభద్ర	ఉదయగిరి	సైదాపురం
ఈ రమాదేవి	సైదాపురం	మనుబోలు
ఎం సురేష్‌బాబు	బోగోలు	కొండాపురం
ఎస్ శ్రీనివాసులురెడ్డి	ఏపీ మారిటైమ్ బోర్డు	బోగోలు (తహసీల్దారు)
జీ రాఘవేంద్రరావు	ఏపీ మారిటైమ్ బోర్డు	తహసీల్దార్ (కలెక్టరేట్)
ఎం కోటేశ్వరరావు	కొండాపురం	లింగసముద్రం
ఎస్ సీతామహాలక్ష్మి	లింగసముద్రం	కందుకూరు (డీఏవో)
ఎం నిరంజన్	ఆత్మకూరు (డీఏవో)	నెల్లూరు (ఐటీడీఏ)
ఏ లక్ష్మీనారాయణ	అల్లూరు	ఏపీ మారిటైమ్‌బోర్డు
ఎం పద్మజ	సెలవు	తహసీల్దార్ (కలెక్టరేట్)
టీవీఎం కృష్ణప్రసాద్	ఇందుకూరుపేట	నెల్లూరు రూరల్
బీ పద్మావతి	తిరుపతి కలెక్టరేట్	టీపీ గూడూరు (తహసీల్దారు)
బీ జయవర్ధన్	ప్రకాశం కలెక్టరేట్	అనంతసాగరం (తహసీల్దారు)
పీ పద్మజా కుమారి	తహసీల్దార్ (కలెక్టరేట్)	ఆత్మకూరు
జీ స్వర్ణ	గుడ్లూరు	డీఏవో (ఆత్మకూరు)
ఎం నయీమ్ అహ్మద్	ప్రకాశం కలెక్టరేట్	వలేటివారిపాలెం
వీ సుధీర్	ఆత్మకూరు	తహసీల్దార్ (కలెక్టరేట్)
సయ్యద్ ఇక్బాల్	డీఏవో, కందుకూరు	తిరుపతి కలెక్టరేట్
ఎస్‌ఎండీ హుస్సేన్	తహసీల్దార్, కలెక్టరేట్	ప్రకాశం కలెక్టరేట్



కౌన్సెలింగ్ నిర్వహణపై ఉపాధ్యాయ సంఘాలతో మాట్లాడుతున్న డీఈవో బాలాజీరావు

ఎస్జీటీలకు మాన్యువల్‌గానే...

● 2,543 మంది దరఖాస్తు, 1516 మందికి తప్పనిసరి స్థానచలనం

నెల్లూరు(విద్య) : సెకండరీగ్రేడ్ టీచర్లకు (ఎస్‌జీటీ) వెబ్ కౌన్సెలింగ్‌పై అపోహలు, సందేహాలు, ఆందోళనలకు తెరదించుతూ మాన్యువల్‌గానే బదిలీలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఉమ్మడి నెల్లూరుజిల్లాలో దరఖాస్తు చేసుకున్న 2,543 మంది ఎస్‌జీటీలకు మాన్యువల్ విధానంలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. బదిలీల ప్రక్రియపై ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆందోళనలు చేస్తున్నా విద్యాశాఖ పట్టించుకోకుండా వారం రోజుల నుంచే వెబ్ ఆప్షన్లను ఇచ్చే ప్రక్రియను ప్రారంభించింది. దీంతో అప్పటికే వెబ్ ఆప్షన్‌లు ఇచ్చిన ప్రభుత్వ, ఉర్దూ పాఠశాలల ఎస్‌జీటీలకు సోమవారం నుంచే బదిలీ ఉత్తర్వులు జారీ ప్రారంభమైంది. వీరితో పాటు జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్ యాజమాన్యాల ఎస్‌జీటీలు కూడా వెబ్ ఆప్షన్‌లు ప్రారంభం కాగా ఇదే ప్రక్రియతో కౌన్సెలింగ్ పూర్తవుతుందని కూడా అధికారులు తెలిపారు. అయితే, మంగళవారం ఉదయం మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్ణయాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించడంతో విడుదల కావాల్సిన ఆర్డర్లన్నీ నిలిచిపోయాయి. జిల్లాలో 2543 మంది ఎస్‌జీటీలు ఉండగా వీరిలో 1516 మంది తప్పనిసరిగా బదిలీ కానున్నారు. వీరందరికీ మాన్యువల్ కౌన్సెలింగ్ పూర్తి చేయాలంటే రోజుకు సగటున 300 నుంచి 400 మంది వరకు మాత్రమే నిర్వహించడం సాధ్యమవుతుందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బదిలీల ప్రక్రియలో గ్రేడ్-2 హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్లు అన్ని కేడర్ సబ్జెక్ట్‌ల ఉపాధ్యాయులకు నూతన బదిలీ స్థానాలను వెబ్ ఆప్షన్ పద్ధతిలోనే కేటాయించారు. వీరందరికీ నియామక ఉత్తర్వులు జారీ చేయడంతో వారు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరిపోయారు. ఎస్‌జీటీలకు మాత్రం మాన్యువల్ పద్ధతిలో కౌన్సెలింగ్ జరగాల్సి ఉండడంతో ఈ ప్రక్రియ ఎన్నిరోజులు పడుతుందోనన్న ఆందోళన విద్యాశాఖ సిబ్బందిలో నెలకొంది. మరోవైపు ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో ఆ సమయానికి కౌన్సెలింగ్ పూర్తి చేస్తారా లేదా అన్నది వేచి చూడాలి.

ఆర్టీసీ డిపో మేనేజర్లు...

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు రీజియన్ పరిధిలో ముగ్గురు డిపో మేనేజర్లను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. నెల్లూరు రెండవ డిపో మేనేజర్ శివకేశవ్ యాదవ్‌ను ఆత్మకూరుకు, ఆత్మకూరు డిపో మేనేజర్ కరిముల్నీషాను నెల్లూరు 2వ డిపోకు బదిలీ అయ్యారు. కావలి డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను కందుకూరుకు బదిలీ చేయగా కావలికి ఎవరినీ కేటాయించకపోవడంతో కందుకూరు డిపో మేనేజర్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

నెల్లూరు ఆర్టీవోగా మదనీ

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రవాణాశాఖలో పలువురు అధికారులను బదిలీ చేస్తూ ఆ శాఖ రాష్ట్ర కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు ఆర్టీవోగా ఉన్న వై శ్రీచందనను మార్కాపురం ఆర్టీవోగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో జంగారెడ్డిగూడెంలో ఆర్టీవోగా ఉన్న మదనీని నియమించారు. ఆయనకు గతంలో నెల్లూరు డీటీసీ కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహించిన అనుభవం ఉంది. కాగా, జిల్లాలో పలువురు జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, ఎంవీఐ, ఏఎంవీఐలను బదిలీ చేస్తూ రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శివరామప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు డీటీసీలో ఎంవీఐగా ఉన్న అనిల్‌కుమార్, ఏఎంవీఐగా ఉన్న సంధ్య, సీనియర్ అసిస్టెంట్ సాయిరాంను నెల్లూరు డీటీసీకి బదిలీ చేశారు. ప్రకాశం డీటీసీలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సునీతను కూడా నెల్లూరు డీటీసీకి మార్చారు. నెల్లూరు డీటీసీలో విధులు నిర్వహిస్తున్న నాగవల్లీశ్వరిని కావలి ఆర్టీవో కార్యాలయానికి, సీనియర్ అసిస్టెంట్లు ఎస్‌కే షాహిన్‌ను ప్రకాశం డీటీసీకి, సీహెచ్ పద్మవతిని తెనాలి ఆర్టీవో కార్యాలయానికి ట్రాన్స్‌ఫర్ చేశారు. కందుకూరు ఆర్టీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న కే లావణ్యను ప్రకాశం డీటీసీకి బదిలీ చేశారు.

జిల్లా పరిషత్, పంచాయతీ శాఖల్లో 108 మంది



నెల్లూరు, (జడ్పీ) : జిల్లా పరిషత్, పంచాయతీ శాఖలలో బదిలీల ప్రక్రియ ముగిసింది. రాష్ట్ర ప్రభుత్వ విధి విధానాల ప్రకారం జిల్లా పరిషత్‌లో 65 మంది, పంచాయతీ శాఖలో 43 మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులను ఉన్నతాధికారులు మంగళవారం జారీ చేశారు.

● జడ్పీలో స్వల్ప వివాదం

బదిలీల ప్రక్రియ పంచాయతీ శాఖలో ప్రశాంతంగా ముగిసినా జిల్లా పరిషత్ స్వల్ప వివాదానికి దారి తీసింది. జిల్లా పరిషత్‌లో కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహించినా ఐదేళ్ల పూర్తి చేసుకున్న వారికి ఎటువంటి భేదాలు రాలేదు. జీరో సర్వీస్ వారికి కూడా అవకాశం ఉంటే బదిలీలు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటంతోనే కొంత గందరగోళం నెలకొంది. అటెండర్ల బదిలీల్లో పారదర్శకత లేదని ఉద్యోగ సంఘాలలోని ఓ వర్గం పేర్కొంది. అయితే ఐదారు నెలల క్రితమే జడ్పీ కార్యాలయం నుంచి బదిలీపై వెళ్లిన వారిని తిరిగి ఇక్కడికే బదిలీ చేయమని ఒత్తిడి చేయడం ఎంతవరకు సబబని, ఏళ్ల తరబడి దూరంగా ఉన్న వారికి అవకాశం ఇవ్వకపోతే ఎలా అంటూ మరోవర్గం వాదింటంతో కొంత గందగోళం నెలకొన్నా బదిలీల ప్రక్రియ మాత్రం ముగిసిపోయింది.

నెల్లూరు ఏఎంసీ కార్యదర్శిగా శ్రీనివాసులు

● కావలికి రామాంజనేయులు

నెల్లూరు(వ్యవసాయం), జూన్ 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా కావలి ఏఎంసీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఎం శ్రీనివాసులు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఆయన్ను బదిలీ చేసింది. అయితే ఆయన ప్రస్తుతం కావలితో పాటు నెల్లూరుకు ఇన్‌చార్జి కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కాగా, పెనుగొండ ఏఎంసీ కార్యదర్శిగా పనిచేస్తున్న టీసీ రామాంజనేయులు కావలి ఏఎంసీకి బదిలీ అయ్యారు. ఈయన గతంలో నెల్లూరు ఏఎంసీ కార్యదర్శిగా పనిచేశారు. అదేవిధంగా కోవూరు ఏఎంసీలో ఓడీగా పనిచేస్తున్న టీ శ్రీనివాసులు కడపకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో దుగ్గిరాల ఏఎంసీ కార్యదర్శిగా ఉన్న ఎన్ శ్రీనివాసరావును ప్రభుత్వం బదిలీ చేసింది.



ఇదేం బాదుడు సారూ!

● రూ.13 బిల్లుకు రూ.421 అదనం

● లబోదిబోమంటున్న విద్యుత్ వినియోగదారులు



నెల్లూరు (జడ్పీ), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ బిల్లులో అసలు కంటే కొసరే ఎక్కువగా ఉంటోంది. కరెంటు వాడకం లేకున్నా ప్రతినెలా అదనపు చార్జీలు భారీగా చెల్లించాల్సి వస్తోంది. దీంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు. సాధారణంగా కరెంటు వాడకాన్ని బట్టి బిల్లులు ఉండాలి తప్ప, వాడకంతో సంబంధం లేకుండా ఇష్టానుసారం అదనపు బిల్లులు వసూళ్ళు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని ఎన్టీఆర్ నగర్ ప్రాంతానికి చెందిన ఓ ఖాళీ ఇంటికి ఈ నెల విద్యుత్ బిల్లును రీడర్ అందజేశాడు. ఆ బిల్లులో కేవలం 7 యూనిట్లు మాత్రమే వాడినట్లు చూపి, చార్జీని రూ.13.30 వేశారు. అయితే, అదనపు చార్జీల కింద రూ.421 కలిపి 434 బిల్లు ఇవ్వడం వినియోగదారుడిని ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఒక్క బిల్లుకు పది రకాల అదనపు చార్జీలను ఒకేసారి విధిస్తున్నారు. పేదలు నివాసముంటున్న కాలనీల్లో సైతం ఇలా భారీగా అదనపు చార్జీలు విధించడంపై వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 7 యూనిట్ల వాడకం కలిగిన సదరు బిల్లుకు అసలు చార్జీ రూ.13.30 వేయగా, ఫిక్సిడ్ చార్జీ రూ.10, కస్టమర్ చార్జీ రూ.25, డ్యూటీ 42 పైసలు, ఎఫ్‌పీపీసీఏ (2022)కు రూ.168.28, ఎఫ్‌పీపీసీఏ (2023)కు రూ.138.07 పైసలు, మళ్ళీ ఎఫ్‌పీపీసీఏ (2025) రూ.60.80, వడ్డీ కింద 12 పైసలు, ట్రూఅప్ చార్జీలు రూ.28.71, ఎనర్జీ లాస్ 28 పైసలు ఇలా మొత్తం రూ.434 బిల్లులో చూపారు. అసలు చార్జీతోపాటు అదనపు చార్జీలుంటే ఒకటో, రెండో ఉండాలి కానీ, ఒకే బిల్లుకు పది రకాల అదనపు చార్జీలు వేయడం ఏమిటని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై పాలకులు స్పందించి, అదనపు చార్జీల భారం నుంచి విముక్తి కలిగించాలని కోరుతున్నారు.



కందుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు, టీడీపీ నాయకులు

మహిళాగ్రహం

వైఎస్ జగన్ రోత పత్రిక, మీడియాపై నారీలోకం కన్నెర్ర జేసింది. అమరావతి మహిళల పట్ల అనుచితంగా మాట్లాడిన వారిని, సాక్షి మీడియా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లావ్యాప్తం గా ఎన్డీఏ కూటమి మహిళా నేతలు ఆందోళనలు చేశారు. కావలి, కందుకూరు, వింజమూరు, కోవూరులలో భారీ ర్యాలీలు నిర్వహించారు.

- వివరాలు 8లో..

13న పీసీసీ చీఫ్ షర్మిల రాక

నెల్లూరు (వైద్యం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈ నెల 13వ తేదీన నెల్లూరుకు వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలియచేశారు. నగరంలోని ఇందిరాభవన్‌లో జరిగే సమావేశానికి రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా నాయకులు, నియోజకవర్గ సమన్వయకర్తలు, జిల్లా, మండల అనుబంధ సంఘం అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి రంగనాథుడి వసంతోత్సవాలు


నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బుధవారం నుంచి వసంతోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు సాయంత్రం స్వామివారికి నవ కలశ స్నపన తిరుమంజనం, విశేష పుష్పాలంకారం, దివ్య ప్రబంధ గోష్ఠి, ఆస్థాన సేవ, శాత్తుమురై జరుగుతాయని తెలిపారు.

సోమశిల అభివృద్ధి పనులకు ఊతం

● ప్రాజెక్టు వద్దకు చేరుకున్న సామగ్రి

● క్రస్ట్‌గేట్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

అనంతసాగరం జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నమ్మయ్య ప్రాజెక్టుకు జరిగిన నష్టం రాష్ట్రంలోని మరే ప్రాజెక్టుకు జరగకూడదన్న సంకల్పంతో రైతు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సోమశిల జలాశయం అభివృద్ధిపై దృష్టి సారించి లోపాలను అధ్యయనం చేసి అత్యవసర పనుల గుర్తించి ప్రాజెక్టుకు ముప్పు జరగకమందే సమగ్రంగా పనులు పూర్తిచేసే విధంగా కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం ఏర్పాటైన అనతికాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమశిల డ్యాంను సందర్శించారు. అనంతరం నిపుణులు, జల వనరుల శాఖ విశ్రాంత ఇంజనీరు, సలహాదారు కన్నయ్యనాయుడును పంపించి పూర్తిసమాచారం తెలుసుకొన్నారు. ఈ క్రమంలో సోమశిల అభివృద్ధికి నిధుల విడుదలకు అడుగులు పడ్డాయి. డ్యాంకు మొత్తం 12 గేట్లు ఉండగా అందులో సగం గేట్ల పరిస్థితి దయనీయంగా ఉన్నాయి. భారీ వరద వస్తే కిందకు నీరు వదల్లేని పరిస్థితి కారణంగా ఇంజనీర్లు ఆందోళన చెందుతున్నారు. 11, 12 గేట్ల రోప్‌లు తుప్పు పట్టి తెగిపోయేస్థితిలో ఉండగా ఇప్పటికే అండర్‌వాటర్ వర్కర్స్ టీంను పిలిపించి నీటిలోపల గేట్ల పటిష్టతను అధ్యయనం చేసి ఫొటోలు సేకరించారు. ఆ బృందంతోనే కొంతమేరకు పనులు చేపట్టారు. తాత్కాలిక చర్యలు కాకుండా ప్రతిపాదనల మేరకు కొత్త రోప్‌లు ఇటీవల ప్రాజెక్టు వద్దకు చేరాయి. క్రస్ట్‌గేట్ల అభివృద్ధికి రూ.2.50 కోట్లు ఖర్చు చేస్తుండగా, ఆర్‌హెచ్‌ఆర్ అభివృద్ధి కోసం రూ.5.25 కోట్లు మంజూరు చేశారు. టెండర్ల దశ పూర్తికాగానే పనులు పూర్తిచేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రస్తుతం జలాశయం నుంచి రెండవ పంటకు నీరు ఇస్తున్నారు. మరి కొంత మేర నీటిమట్టం తగ్గితే పనులు ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయి.



జలాశయం వద్దకు చేరుకున్న కొత్తరోప్‌లు

దూర విద్య.. దగ్గరవుతోంది!

ఏలూరు కేంద్రంగా అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ

త్వరలోనే అడ్మిషన్ల ప్రక్రియ

ఏపీలో బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఉద్యోగులకు, యువతకు ఊరట లభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ కేంద్రంగా ఇప్పటివరకు కొనసాగిన ఈ వర్సిటీ రాష్ట్ర విభజన పదేళ్ల కాలం పూర్తవడంతో ఈ ఏడాది జనవరి నుంచి ఆ యూనివర్సిటీ పరిధిలోని ఏపీ కేంద్రాలన్నీ మూసివేశారు. సిబ్బంది జీతాలను నిలిపివేయడంతో పాటు విద్యార్థుల అడ్మిషన్లను కూడా నిలిపివేశారు. దీంతో జిల్లాలో వివిధ కోర్సుల్లో చదువుకుంటున్న పదివేల మందికిపైగా విద్యార్థుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. నాటి నుంచి ఎంతో మంది చేసిన విజ్ఞప్తులు, పోరాటాలతో ఎట్టకేలకు రాష్ట్రంలో వర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేయడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

నెల్లూరు (విద్య), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన ఏపీ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని 1992లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంగా పేరు మార్పు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న నేపథ్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో ఏపీలో అడ్మిషన్లను నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఏపీలోని అభ్యాసక సహాయ కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది, పార్ట్‌టైమ్ ఉద్యోగుల జీతాలు కూడా నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. అలాగే అంబేడ్కర్ వర్సిటీలో అడ్మిషన్లు తీసుకుని ఇంకా కోర్సులు పూర్తి చేయని వారు రాష్ట్రంలో 2 లక్షల మంది ఉండగా జిల్లాలో 10వేల మందికిపైగా ఉన్నారు. 2023-24లో డిగ్రీ మొదటి సంవత్సరంలో 12వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా, రాష్ట్రంలో మొత్తం అన్ని కోర్సులు కలిపి 35 వేల మంది విశ్వవిద్యాలయంలో చేరారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు 89శాతం అడ్మిషన్ తీసుకున్నారు. మొత్తం విద్యార్థుల్లో 48శాతం మహిళలు చదువుకుంటుండగా, ఏపీ అధ్యయన కేంద్రాల్లో అడ్మిషన్లు, ఫీజుల రూపంలో రూ.21 కోట్లను తెలంగాణా ప్రభుత్వానికి చెల్లించేవారు. వీరు తిరిగి ఏపీలో పనిచేసే సిబ్బందికి రూ.4కోట్లు చెల్లించేవారు. రాష్ట్ర విభజన అనంతరం అనేక సవాళ్లను ఎదుర్కొనడంతో పాటు గడిచిన మూడేళ్ల నుంచి అధ్యయన కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీతాలు కూడా ఆపివేశారు. అందరూ కలిసి పోరాడగా కొంతవరకు చెల్లించి మిగిలినవి పెండింగ్‌లో ఉంచారు. దీనిపై జిల్లాలోని అధ్యయన కేంద్రాల నిర్వాహకులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఆందోళనలు సైతం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుకు కృషి చేయాలని జిల్లా అధ్యయన కేంద్రం సిబ్బంది మాజీ రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడును కోరుతూ విజ్ఞప్తి కూడా చేశారు. వెంకయ్య కూడా ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వర్సిటీ సిబ్బంది తెలిపారు.

ఫలించిన పోరాటాలు

రాష్ట్రంలో అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్‌లో తీర్మానం చేసి జీఓను కూడా విడుదల చేసింది. ఈ క్యాంపస్ ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం నుంచే వివిధ కోర్సులకు నోటిఫికేషన్లు జారీ చేస్తున్నట్లు వర్సిటీ వ్యవహారాల ప్రతినిధులు ప్రకటించారు. ఇప్పటికే వర్సిటీ పరిధిలోని విద్యార్థులు, సిబ్బందికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఏలూరు కేంద్రంగా వర్సిటీ క్యాంపస్ ఉండబోతోందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల స్టడీసెంటర్లన్నీ దీని పరిధిలోకి రానున్నాయని చెబుతున్నారు. వర్సిటీకే నేరుగా విద్యార్థుల ఫీజుల ద్వారా ఆదాయ వనరులు సమకూరనుండటంతో సిబ్బంది జీతాలకు కూడా ఎలాంటి ఇబ్బందులు కలగవు. జిల్లాలో ఇప్పటికే ఈ వర్సిటీ ద్వారా పదివేలమందికి పైగా విద్యనభ్యసిస్తుండగా, అడ్మిషన్లు ప్రారంభమైతే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని స్టడీ సెంటర్ నిర్వాహకులు తెలిపారు.



నెల్లూరులో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది (ఫైల్)

కండలేరు నీటిమట్టం 38.220 టీఎంసీలు

రాపూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండలేరు జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 38.220 టీఎంసీల నీరు ఉన్నట్టు కండలేరు డ్యాం ఏఈ కట్ట తిరుమలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌ఫ్లో ఆగిపోగా, అవుట్ ఫ్లో హెడ్ రెగ్యులేటర్ నుంచి 2400 క్యూసెక్కులు, లోలెవల్ స్లూయిస్ నుంచి 60 క్యూసె క్కులు, హైలెవల్ కెనాల్ నుంచి 50 క్యూసెక్కులు మొత్తం 2510 క్యూసె క్కుల నీరు అవుట్‌ఫ్లో అవుతుందని కండలేరు ఏఈ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9269
వెండి కిలో ధర	రూ. 109600
వెండి ఒక గ్రాము	రూ. 112.60

శిథిలావస్థలో పోలీసు నివాసాలు

● తలుపులు, కిటికీల చోరీ ● రూ.లక్షల ప్రజాధనం వృథా ● 40 ఏళ్లకే పాడైన ఇళ్లు

వెంకటాచలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): విధులు నిర్వహించే చోటే నివాసాలు ఉండాలన్న నిబంధన మేరకు సుమారు 40 ఏళ్ల కిందట పోలీసుల కోసం ప్రభుత్వం ఇళ్లు ఏర్పాటు చేసింది. అయితే వాటిని వినియోగించుకోక పోవడంతో నేడు అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వెంకటాచలం పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వరించే పోలీసుల కోసం ప్రభుత్వం సర్వేపల్లి క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారికి అనుకుని 10 క్వార్టర్లను నిర్మించి ఇచ్చింది. కొత్తవి కావడంతో సిబ్బంది అప్పట్లో కొన్నేళ్లపాటు వాటిలో నివసించారు. కాలక్రమంలో సిబ్బంది వాటిలో నివాస ముండకపోయేసరికి అవి క్రమంగా శిథిలావస్థకు చేరాయి. దీంతో ఆ ప్రాంతం చెట్లపొదలతో దట్టమైన అడవిలా మా



దట్టమైన అడవిలా కనిపిస్తున్న పోలీస్ క్వార్టర్స్

రింది. అంతేకాక కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఇళ్ల కిటికీలు, తలుపులను చోరీ చేసుకువెళ్లారు. మరి కొందరయితే గదుల్లో పరిచి ఉన్న నాపరాళ్లను కూడా ఊడదీసుకుని పోయారు. జాతీయ రహదారికి అనుకుని ఉన్న పాత పోలీసు స్టేషన్ భవనం కూడా ఇదే పరిస్థితిలో ఉంది. ఈ భవనంలో నిల్వ ఉంచిన టపాసులు పేలడంతో అది కొంతమేర ధ్వంసమైంది. మిగిలిన భవనం నిరుపయోగంగా కూడా మారింది. పోలీస్ క్వార్టర్స్ చుట్టూ ప్రహరీ నిర్మించి క్వార్టర్లకు మరమ్మతులు చేయించి, నీటి వసతి కల్పిస్తే సిబ్బంది నివాసాలు ఉండే అవకాశం ఉంది. అంతేకాక గ్రామంలో పోలీసు శాఖకు మరిన్ని విలువైన ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇకనైనా పోలీస్ అధికారులు స్పందించి పోలీస్‌శాఖకు చెందిన స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే అక్రమణకు గురికాకుండా ఉంటాయి. ఆదిశగా పోలీస్ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శివాలయంలో పల్లకీ సేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

కోవూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక శివాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం పల్లకీసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. పూజారి విశ్వనాథం సుబ్బరామయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఉభయదాతగా శ్రీకాకుళం రవికుమార్ దంపతులు వ్యవహరించారు.

ఘనంగా పొణకా కనకమ్మ జయంతి



పొణకా కనకమ్మ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఆశ్రమ కమిటీ నిర్వాహకులు

ఇందుకూరుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆశ్రమ స్థల దాత, స్వాతంత్ర్య సమరయోధురాలు పొణకా కనకమ్మ 133వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల, స్కూల్ ఉపాధ్యాయురాలు నువ్వూరి గౌరీ, పొణకా కనకమ్మ విగ్రహానికి పట్టువస్త్రం, పూలమాల సమర్పించారు. అనంతరం కమిటీ సభ్యులు రాయసం దామోదర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో నెల్లూరుకి జాతీయఖ్యాతి తెచ్చిన ధీరవనిత పొణకా కనకమ్మ అని అన్నారు. పల్లెపాడు పెన్నానది ఒడ్డున గాంధీ ఆశ్రమం కోసం సుమారు 13 ఎకరాలు కొని దానం చేసిన మహోన్నత వ్యక్తి పొణకా కనకమ్మ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దువ్వూరు రామ్మోహన్‌రెడ్డి, గాంధీ ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం సుమంత్‌రెడ్డి, షేక్.అల్లాబక్షు, వేణురెడ్డి, గాంధీ ఆశ్రమ మేనేజర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారం జగనన్న ప్లాట్ల విక్రయాలు

తోటపల్లిగూడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం పంచాయతీలో గల జగనన్న (స్వర్ణపురి) కాలనీలోని ఇళ్ల ప్లాట్లను వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారని టీడీపీకి చెందిన మాజీ సర్పంచి చేవూరు శ్రీనివాసులు ఆరోపించారు. గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ సుమారు 22 ప్లాట్లను ఇచ్చారని, కానీ అర్హులకు ఇవ్వలేదన్నారు. కోరుకున్న చోట వైసీపీ నాయకులు ప్లాట్లను తీసుకుని, వాటి పక్కన కొంత మంది గిరిజనులకు ఇచ్చారని తెలిపారు. గిరిజనులను భయభ్రాంతులకు గురిచేసి, కొంతమంది వైసీపీ నాయకులు రూ.2లక్షలకు ఒక్కొక్క ప్లాట్‌ను కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆ కాలనీలో అర్హులకు అన్యాయం జరిగిందని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి అర్హులకు ప్లాట్లు ఇవ్వాలని ఆయన కోరారు.

ప్రసన్న ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు



హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు

కొడవలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో వెలసి ఉన్న ప్రసన్న ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ప్రత్యేక హోమం, ఆకుపూజ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

కొడవలూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెయ్యా లపాలెంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు మండల టీడీపీ కమిటీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన తెలిపారు.

జొన్నవాడలో వేడుకగా 16రోజుల పండుగ

● సింహ వాహనంపై మల్లికార్జున సమేత కామాక్షితాయి దర్శనం
● గర్భాలయాలలో ప్రత్యేక పుష్పాలంకరణ

బుచ్చిరెడ్డిపాళెం, జూన్10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో మంగళవారం మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారికి 16రోజుల పండుగను అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి స్వామి, అమ్మవారు సింహవాహనంపై ఆలయంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతరాలయం, గర్భాలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. 16రోజుల పండుగను పురస్క



సింహవాహనంపై ఊరేగుతున్న ఆదిదంపతులు

రించుకుని ఓ భక్తబృందం కామాక్షితాయి చిత్రపటంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. రాత్రి టీటీడీ సత్రం ఆవరణలో అన్న ప్రసాద వితరణ చేశారు. రాత్రి ఆలయంలో ఉభయకర్త బండి లక్ష్మీనరసారెడ్డి, శైలజ దంపతులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే భక్తులకు చీరలు, పంచెలు పంపిణీ చేశారు. కాగా స్వామి, అమ్మవారికి శయనమందిరంలో ఏకాంతసేవ నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవారికి భక్తిపాటలు ఆలపించారు. ఏకాంతసేవలో స్వామి,అమ్మవారికి. పండ్లు పాలు, పలు ప్రసాదాలు నివేదించాక, వాటిని భక్తులకు పంపిణీ చేశారు.



జొన్నవాడ ఆలయంలో ప్రత్యేక పుష్పాలంకరణ

క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసేందుకు కృషి




సభలో మాట్లాడుతున్న సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

ముత్తుకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి చేస్తామని టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. మండలంలోని దొరువులపాలెంలో మంగళవారం జరిగిన ఎస్వీవీఎస్ ప్రీమియర్ లీగ్ బహుమతి ప్రదానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగిన క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయన్నారు. క్రికెట్ టోర్నమెంట్‌ను అద్భుతంగా నిర్వహించారని నిర్వాహకులకు అభినందించారు. ఎస్వీవీఎస్ టోర్నీ నిర్వాహకుల సహకారంతో భారీ ప్రీమియర్ లీగ్ నిర్వహిస్తామని ప్రకటించారు. విజేతలకు బహుమతులు రాజగోపాల్‌రెడ్డి, ఆయన సతీమణి శృతిరెడ్డి అందజేశారు. అనంతరం గ్రామంలో జరిగిన రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఆయన సహకారంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నీలం మల్లికార్జునయాదవ్, నాయకులు మురళీధర్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పండుగతో గ్రామాలకు మహర్దశ

ఇందుకూరుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలకు మహర్దశ పట్టిందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలోని గంగపట్నంలో మంగళవారం ఆమె పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.20లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. జల్‌జీవన్ మిషన్ కింద రూ.38.7లక్షల వ్యయంతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబునాయుడు సారథ్యంలో, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పడుతున్నాయన్నారు. రోడ్ల దగ్గర నుంచి డ్రెయిన్ల వరకు అన్నీ సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తట్ట మట్టి వేసిన దాఖలాలులేవని విమర్శించారు. అన్ని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. త్వరలోనే స్పౌజ్ పింఛన్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అందించనున్నామని ఆమె చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేపడతామని స్పష్టం చేశారు.



చాముండేశ్వరికి సమర్పించడానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకువెళుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

● పట్టువస్త్రాల సమర్పణ

అనంతరం గంగపట్నం చాముండేశ్వరి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేకువజామున జరిగే కల్యాణోత్సవానికి అమ్మవారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు అందించారు. అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు దేవదాయ శాఖ మంత్రి ఆనం దృష్టికి తీసుకువెళ్తున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, వీ రేంద్రనాయుడు, కొండూరు సుధాకర్‌రెడ్డి, చెంచుకిశోర్, బొద్దుకూరు సుధాకర్, సుధీర్, దుగ్గా శంకర్‌రెడ్డి, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మారామస్వామి గ్రామోత్సవం

సంగం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో జరుగుతున్న ఆత్మారామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి హనుమంత వాహనంపై ఆత్మారామస్వామి ఊరేగారు. ఈ సందర్భంగా ఆత్మారామస్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి గ్రా మ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హరతులతో స్వాగతం పలికారు.

వైభవంగా వీరాంజనేయ గ్రామోత్సవం

పొదలకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని వీరాంజనేయస్వామికి మంగళవారం వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.హనుమజ్జయంతి అనంతరం 13 వారాల ఉత్సవాల్లో భాగంగా మూడోవారమైన మంగళవారం యాదవ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని స్వామివారికి ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహించారు. రాత్రి జరిగిన గ్రామోత్సవాన్ని కోలాటాలు, మంగళవా యిద్యాలు, బాణసంచా వేడుకలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో యాదవ యూత్ సభ్యులు, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



గ్రామోత్సవంలో వీరాంజనేయస్వామి

వేసవి శిక్షణ శిబిరాల ముగింపు

పొదలకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి సచివాలయం పరిధిలో కిశోర వికాసం వేసవి శిక్షణ శిబిరాల ముగింపును మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో బాల్య వివాహాలు వల్ల కలిగి దుష్ప్రయోజనాలు, వాటి నివారణ గురించి కిశోర బాలికలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం కిశోర బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా సచివాలయ ఎంఎస్‌కే సీహెచ్.వీ.రూప, హెల్త్ సూపర్‌వైజర్ నరసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ యమున, ఏఎన్‌ఎం జీ.అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మాధురి, అమరావతి, శ్రీలక్ష్మి గాయత్రి, శీనమ్మ, ఆశా కార్యకర్తలు పెంచలమ్మ, కౌసల్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సచివాలయ ఎంఎస్‌కే రూప

బాల్య వివాహాలను అరికట్టాలి

రాపూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ సీడీపీవో సునంద అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసం వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహాల వలన కలిగే నష్టాల గురించి బాలికలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడీవో భవాని, తహసీల్దార్ పిఎల్ నరసిం హం, టీడీపీ నాయకులు చెన్ను భాస్కర్‌రెడ్డి, రాపూరు సెక్టార్ సూపర్వైజర్ రాధిక, అంగన్వాడీ కార్యకర్తలు, కిశోరి బాలికలు, తల్లులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీడీపీవో సునంద

కిశోరి బాలికల వికాసంపై అవగాహన

తోటపల్లిగూడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరుకూరులో కిశోరి బాలికల వికాసంపై మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ మే 2 నుంచి జూన్ 10 వరకు గ్రామంలో జరిగిన కార్యక్రమాల గురించి కిశోరి బాలికల తల్లిదండ్రులకు వివరించారు. ప్రతి ఒక్క కిషోరి బాలిక కూడా సమాజంలో ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆమె కోరారు. ఎంపీటీసీ రఘుబాబు, సర్పంచి శారద మాట్లాడుతూ పిల్లలు సోషల్ మీడియాకి దూరంగా ఉండాలని తెలిపారు. బాల్య వివాహం చేసుకోవడం నేరమని, ప్రతి గ్రామాన్ని బాల్య వివాహరహిత గ్రామంగా తయారు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కె హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



బాలికను సన్మానిస్తున్న ఎంపీటీసీ రఘుబాబు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపర్తిపాళెం రైల్వేగేటు సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై మంగళవారం జరిగిన ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే, నెల్లూరు నగరానికి చెందిన కామేశ్వరరావు, సుబ్రహ్మణ్యం పంటపాళెం సమీపంలో ఉన్న అయిల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని మోటర్ బైక్‌పై నెల్లూరుకు వస్తుండగా, పూడిపర్తి నుంచి సర్వేపల్లి వైపు వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్ బోల్తాపడి ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సర్వేపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్‌ను
సమర్థవంతంగా అమలు చేయాలి

ఆత్మకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్నిశాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. మంగళవారం నెల్లూరులోని ఆనం క్యాంపు కార్యాలయంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్‌పై ఆయన అధికారులతో శాఖలవారీగా సమీక్షించి చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. లక్ష్యాలను చేరుకునేందుకు పక్కా ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బి పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, చీఫ్ ప్లానింగ్ అధికారి రఘురామయ్య, ఆర్ అండ్‌బి, పంచాయతీరాజ్, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. కాగా స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు మంత్రి ఆనం అధ్యక్షతన సమీక్ష జరుగుతుందని ఆనం క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

C.R.I.M.E N.E.W.S

కప్పరాళ్లతిప్పలో పోలీసుల కార్డెన్ సెర్చ్

● 32 బైకులు, మూడు ఆటోల స్వాధీనం



పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న కావలి డీఎస్పీ శ్రీధర్

బిట్రగుంట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలో కావలి డీఎస్పీ పీ.శ్రీధర్ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందితో కలసి మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారు జామున 4.30 నుంచి ఉదయం 7 గంటల వరకు తిప్పలోని ప్రతి ఇంట్లో సోదాలు చేపట్టారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని 32 మోటారు బైకులు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించామని తెలిపారు. ముఖ్యంగా అనుమానిత వ్యక్తులు, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు ఏమైనా ఉన్నాయా అని తనిఖీలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు బీ.పాపారావు, గిరిబాబు, రాజేశ్వరరావు, ఫిరోజ్, స్థానిక ఎస్ఐ భోజ్య, వివిధ స్టేషన్లకు చెందిన 8 మంది ఎస్ఐలు, 60 మంది సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిపై కత్తితో దాడి

బిట్రగుంట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఓ ఐటీఐ విద్యార్థిపై కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి బోగోలు కుమ్మరివీధిలో జరిగింది. దీనిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భోజ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఇంటి పరిసరాల్లో డైపర్ వేశారన్న నెపంతో కుమ్మరవీధిలో నివాసం ఉంటున్న బోగిరి కన్నమ్మపై ఆదివారం అదే ప్రాంతానికి చెందిన ప్రభుకుమార్ కుటుంబ సభ్యులు దుర్భాషలు ఆడారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరగగా స్థానికుల చొరవతో సద్దుమణిగింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి బోగోలు నుంచి ఒంటరిగా వస్తున్న కన్నమ్మ మనవడు రాగాల జాషువాడేనియేల్‌పై ప్రభుకుమార్ కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలైన ఆ యువకుడి కేకలతో చుట్టుపక్కల వారు రావడంతో ప్రభుకుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఉద్దేశపూర్వకంగానే హత్య చేసేందుకే కత్తితో దాడి చేశాడని బాధితుని తండ్రి సోమేశ్వరరావు అంటున్నారు. నిందితుడు ప్రభుకుమార్ కోసం పోలీసులు గాలింపులు చర్యలు చేపట్టారు.



చికిత్స పొందుతున్న జాషువా డేనియేల్

తల్లిని బాగా చూసుకోమన్నందుకు
తమ్ముడిపై అన్న దాడి : గాయాలు

నెల్లూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తల్లిని బాగా చూసుకోమన్నందుకు తమ్ముడిపై అన్న దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. నెల్లూరు రూరల్‌లోని సౌత్‌మోపూరు పంచాయతీ మొగళ్లపాళెం రోడ్డు వద్ద ఈ ఘర్షణ జరిగింది. రూరల్ సీఐ గుంజి వేణు అందించిన వివరాల మేరకు... సైదాపురం మండలం కృష్ణారెడ్డిపల్లెకు చెందిన కుంచెం అంకయ్య (32) నెల్లూరు శివార్లలోని కొత్తూరు వద్దనున్న వల్లూరమ్మ కాలనీలో నివాసముంటున్నాడు. అతని తల్లి సొంతూరులోని సోదరుల వద్ద జీవిస్తోం ది. ఆమెను సోదరులు సరిగా చూడటం లేదని తెలుసుకున్న అంకయ్య సోమవారం తన స్నేహితులు శీను, హరితో కలిసి కారులో సొంతూరుకు వెళ్లి సోదరులను మందలించి తిరుగు ప్రయాణమ య్యాడు. పొదలకూరు రోడ్డు నుంచి మొగళ్లపాళెం వెళ్లే కూడలి వద్ద కాసేపు ఆగారు. అయితే తమ్ముడిని వెంటాడుతూ అతని అన్న (ఆయన పేరు కూడా అంకయ్యే), అయన స్నేహితులు సింహరి, శీను, ఏడుకొండలు అక్కడికి వచ్చి తమ్ముడు అంకయ్యపై కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేసి పరారయ్యారు. తలపై తీవ్రగాయాలైన తమ్ముడు అంకయ్య, తన స్నేహితుల సహాయంతో నగరంలోని బొల్లినేని ఆసుపత్రిలో చేరాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బోడిగాడితోట ప్రభుత్వ వైద్యశాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆ ప్రాంతంలో సోమవారం రాత్రి అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని స్థాని కులు 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మంగళవారం సమాచారం అందుకున్న 5వ వార్డు వీఆర్వో భాస్కరయ్య నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతి చెందిన వ్యక్తి కొంతకాలంగా మద్యం సేవించి బోడిగాడితోట పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ ఉండేవాడని స్థానికులు పోలీసులకు తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందన్న మనస్థాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో రబ్బానీ (30), మమూల దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. రబ్బానీ తన ఇంటి పక్క వీధిలో టిఫిన్ అంగడి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను భార్య, పిల్లలను పట్టించుకోకపోవడంతో దంపతుల మధ్య మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ నెల 8న వారి మధ్య గొడవ జరగడంతో భార్య అలిగి పిల్లలను తీసుకుని శ్రీనివాసనగర్ లోని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం రబ్బానీ ఉరేసుకుని మృతి చెందాడు. అతని స్నేహితుడు అక్బర్ అలియస్ ఇక్బాల్ సమాచారంతో భార్య, బంధువులు ఇంటికి చేరుకున్నారు. మమూల ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

పాత గొడవలతో ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై కొందరు దాడిచేసిన ఘటన మంగళవారం వెంగళరావ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని వెంగళరావ్‌నగర్‌కు చెందిన ఏ ప్రభుకు అదే ప్రాంతానికి చెందిన వాసుతో గొడవలున్నాయి. ప్రభు మంగళవారం తన మేనత్త మేరి ఇంటికి వెళ్లగా అక్కడకు చేరుకున్న వాసు, అతని కుటుంబ సభ్యులు, బంధువులు ప్రభుపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థలం విషయమై ఇరువర్గాల ఘర్షణ

బిట్రగుంట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అల్లిమడుగు పంచాయతీ కడనూతల ఇందిరమ్మ కాలనీలో మంగళవారం ఓ స్థలం విషయమై ఇరువర్గాలు దాడులకు దిగాయి. ఈ దాడుల్లో నాటకరాణి సురేంద్ర, సునీత, వేణు గాయపడటంతో కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కావలి రూరల్ సీఐ పాపారావు క్షతగాత్రులతో మాట్లాడారు. సీఐ మాట్లాడుతూ కాలనీలో ఉన్న స్థలాన్ని శుభ్రపరిచే విషయమై అదే కాలనీకి చెందిన నాటకరాణి బాబు, నాటకరాణి సురేంద్రల మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలిపారు. మాట మాట పెరిగి సురేంద్ర, సునీత, వేణులపై బాబు దాడి చేసినట్లు బాధితులు చెప్పారని తెలిపారు. అయితే ఈ దాడిలో బాబుతోపాటు ఆయన భార్య శైలజ కూడా గాయపడి, కావలి ప్రభుత్వ వైద్యశాలలో చేరారని తెలిపారు. ఎస్ఐ భోజ్య విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 550

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు రెండవ డిపో పరిధిలోని ప్రయాణికులు, ప్రజల నుంచి ఫిర్యాదులు, సూచనలు, సలహాలు స్వీకరించేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ శివకేశవ యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ఫిర్యాదులు, సలహాలు ఇవ్వదలచిన వారు 9959225642 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ఆర్ఎస్ఆర్ఎంలో నేత్రదాన అవగాహన

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నేత్ర దానం చేసి ఇద్దరికి చూపు ప్రసాదించండి. నేత్ర దాన ప్రయోజనాలు విద్యార్థులు వారి తల్లిదండ్రులకు తెలిపి నేత్రదానాన్ని ప్రోత్సహించాలని ప్రజా సైన్స్ వేదిక నగర్ శాఖ అధ్యక్షుడు ఎం సతీష్ కుమార్ కోరారు. నగరంలో ఆర్ఎస్ఆర్ఎం పాఠశాలలో ప్రజా సైన్స్ వేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ నేత్రదాన దినోత్సవం సందర్భంగా మంగళవారం నేత్రదానంపై అవగాహన సదస్సు జరిగింది. ప్రతీ ఒక్కరూ నేత్రదానాన్ని ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు.

న్యూస్ బాక్స్

త్వరలో 'వీపీఆర్ నేత్ర' ప్రారంభం

● ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో త్వరలో వీపీఆర్ నేత్ర కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చెప్పారు. మంగళవారం నగరంలోని ఆమె నివాసంలో 12 మంది దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా కంటి పరీక్షల నిర్వహణకు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి శ్రీకారం చుడుతున్నారని తెలిపారు.

మార్కెట్‌లోకి న్యూ ఆల్ట్రోజ్ కారు విడుదల

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కాకుటూరులోని శివశంకర్ మోటార్స్ టాటా షోరూంలో న్యూ ఆల్ట్రోజ్ కారును మంగళవారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంవీఐ బాలమురళి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు సేఫ్టీ ప్రమాణాలు ఉన్న వాహనాలపై మక్కువ చూపాలని సూచించారు. షోరూమ్ యాజమాన్యం మాట్లాడుతూ ఆల్ట్రోజ్ వాహనం డీజిల్, పెట్రోల్, సీఎన్జీ వేరియంట్లలో లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ రవి, జీఎం మురళి, జెడ్ఎమ్ జయదీప్ గుప్తా, రీజనల్ మేనేజర్ గోపి, శ్రావణ్, మేనేజర్ మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

కొండాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంపై మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ఆనందరావు పాల్గొని మాట్లాడుతూ నూతన మెనూ ను తెలియచేసి ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలకే సన్నబియ్యం నేరుగా సరఫరా చేస్తుందన్నారు. మండలంలో ఉన్న 62 మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు.

ఇండోసోల్ కోసం మామిడి తోటలను నాశనం చేయొద్దు

కందుకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ పరిశ్రమ కోసం ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ పరిధిలో దశాబ్దాలుగా పెంచుకొన్న మామిడి తోటలు, ఇతర తోటలను ధ్వంసం చేసేందుకు ప్రభుత్వం సిద్ధ పడడం దుర్మార్గపు చర్య అని ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన కరేడు గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. అనంతరం కందుకూరులో విలేకర్లతో మాట్లాడుతూ.. కరేడు పరిధిలో ఎంతో విలువైన భూములను ఇండోసోల్ కంపెనీకి కట్టబెట్టాలనే కుట్ర తప్ప ఇందులో ఏమాత్రం హేతుబద్ధత లేదని విమర్శించారు. సోలార్ ఎనర్జీ ప్లాంట్‌కు ఎక్కడైనా నిరుపయోగమైన ఎండలు అధికంగా ఉండి పంటలు పండని భూములు కేటాయిస్తారు తప్ప ఇలా ఏటా మూడు పంటలు పండే భూములు కాదని పేర్కొన్నారు. రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్ పరిశ్రమలు పూర్తయితే తీరప్రాంతంలో భూముల విలువ భారీగా పెరగనున్నందు వల్ల ఆ భూములపై ఇండోసోల్ కంపెనీ కన్నేయడం అందుకు ప్రభుత్వం సహకరించడం అన్యాయం అన్నారు.

అర్ధరాత్రి కరెంటు కష్టాలు!

కావలి రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉక్కపోత, కరెంటు కోతలతో కావలి పట్టణం వైకుంఠపురం, జనతాపేట వాసులకు తరచూ రాత్రి సమయాల్లో కరెంటు కష్టాలు తప్పడం లేదు. అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు 2 గంటల పాటు విద్యుత్ సరఫరా లేక వీధులన్నీ గాడాంధకారంగా మారాయి. ఎక్కువగా పేదలు నివసించే వైకుంఠపురంలో విద్యుత్ కోత, ఉక్కపోతతో ఆ ప్రాంత వాసులు అర్ధరాత్రి సయాల్లో చంటటి బిడ్డలతో వీధుల్లోకి చేరాల్సి వస్తుందని వాపోతున్నారు. విద్యుత్ కోత విషయమై అధికారులకు సమాచారం చేరవేసేందుకు అనేక మార్లు అధికారులకు ఫోన్లు చేసినా బాధ్యతా యుతంగా పని చెయ్యాల్సిన సంబంధిత అధికారులు ఫోన్లు తియ్యడం లేదని అంటున్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె బాట

● గత ప్రభుత్వ హామీలు నెరవేర్చాలని డిమాండ్

● మేయర్, కమిషనర్‌కు నోటీసులు ● 20వ తేదీ వరకు గడువు

నెల్లూరు(సిటీ), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తమతో గత ప్రభుత్వంలో కుదుర్చున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు ఆందోళన బాటపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ స్రవంతి, కమిషనర్ నందన్‌కు సమ్మె నోటీసులు అందచేశారు. ముందుగా కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కే పెంచల నరసయ్య, గౌరవ అధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. గత ప్రభుత్వంలో 17 రోజులపాటు సమ్మె చేసిన అనంతరం ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్, సెమిస్కిల్ ఆధారంగా జీతాలు చెల్లిస్తామని, ఉద్యోగ విరమణ వయోపరిమితిని 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగ విరమణతోపాటు ఆర్థిక ప్రయోజనాలు కల్పిస్తామని, వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వాగ్దానం చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక అవేవీ జరగడం లేదని వాపోయారు. కార్పొరేషన్ పరిధిలోని 93 మంది కార్మికులను అర్ధాంతరంగా విధుల నుంచి తొలగించారని మండిపడ్డారు. ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు రూ.15 వేలు జీతం ఏ మాత్రం సరిపోదని, వెంటనే వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఈ నెల 20వ తేదీపైన ఏ క్షణమైనా సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు కొండా ప్రసాద్, శివాజీ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్ నందన్‌కు సమ్మె నోటీసు అందచేస్తున్న కార్మిక నాయకులు



శివాజీ సెంటర్.. రాజకీయాలు, సేవల కూడలి

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ట్రంకురోడ్డులో ఉన్న శివాజీ సెంటర్ రాజకీయ, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు చిరునామాగా గుర్తింపు పొందింది. నగరం నడిబొడ్డులో ఉన్న గాంధీబొమ్మకు సమీపాన ఈ ప్రాంతం ఉంటుంది. ఒకప్పుడు మార్వాడీలు ఈ సెంటర్‌లో లస్సీ విక్రయించేవారు వారి తరం ముగిసినా ఆపేరు మీదనే ఇప్పటికీ అక్కడ లస్సీ విక్రయాలు జరుగుతున్నాయి. బీజేపీ, విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ దాని అనుబంధ సంఘాలు గత 30 సంవత్సరాలుగా ఛత్రపతి శివాజీ సెంటర్‌గా నామకరణం చేసి, నగర పాలక సంస్థలో నోటిపై చేయించారు. ఇక్కడ రాజకీయ సభలు, గణేష్ ఉత్సవాలు, ఉగాది వేడుకలతోపాటు అన్నదాన కార్యక్రమాలు, ఇతర సేవా కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఉదయం నుంచి రాత్రి వరకు ఆ సెంటర్‌లో దేశ, విదేశీ రాజకీయ మార్పులపై జనం చర్చించుకుంటూ ఉంటారు. ఈ ఒరవడి పొట్టిశ్రీరాములు నుంచి నేటి తరం వరకు కొనసాగుతోంది. కొన్ని నెలల క్రితం ఆ కూడలిలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆ సెంటర్‌కు కొత్త శోభను తెచ్చారు.

నెల్లూరు రూరల్ తహసీల్దారుగా కృష్ణప్రసాద్



నెల్లూరు రూరల్, జూన్ 10 (ఆంధ్ర జ్యోతి) : నెల్లూరు రూరల్ మండలం తహసీల్దారుగా టీవీఎం కృష్ణప్రసాద్‌ను నియమిస్తూ జిల్లా అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన ఇందుకూరుపేట మండలం తహసీల్దారుగా విధులు నిర్వర్తిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన్ను నెల్లూరు రూరల్‌కు కేటాయించారు. రూరల్ తహసీల్దారుగా ఉన్న లాజరస్‌ను కలెక్టర్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. కాగా, బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు కృష్ణప్రసాద్ తెలిపారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



యోగా ప్రదర్శన నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

నెల్లూరు (వైద్యం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. మంగళవారం 47వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో యోగాంధ్ర అవగాహన ప్రదర్శన నిర్వహించారు. గుప్తాపార్కు నుంచి ములుముడి బస్టాండ్ మీదుగా చిన్ని బజారు వరకు ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిక, శ్వేత, అలేఖ్య, సుహాసిని, సచివాయ సిబ్బంది అడ్మిన్ మెహర్నిసా, ఆలీ, మోసెస్, లక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా చూడండి

● జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ



అధికారుల సమీక్షలో మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ

నెల్లూరు (వైద్యం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి హుస్సేనమ్మ ఆదేశించారు. మంగళవారం మలేరియా యూనిట్ అధికారులతో ఆమె సమీక్ష జరిపారు. డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి వ్యాధుల కేసులు ఎక్కడైనా నమోదైతే వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా ప్రాంతాల ప్రజలకు కీటకజనిత వ్యాధులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. శుక్రవారం నిర్వహించే ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై ఆరోగ్య కార్యకర్తలకు తగిన సూచనలు, సలహాలు అందచేయాలన్నారు. నీటి గుంతల్లో దోమల నివారణకు గంబూజియా చేపలను వదలాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జున రావు, సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

వావిలేటిపాడులో 'అంగన్‌వాడీ పిలుస్తోంది'



చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లోని వావిలేటిపాడు ప్రాంతంలో ఐసీడీఎస్ అధికారులు మంగళవారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సీడీపీవో అరుణ, సూపర్‌వైజర్ స్వరూప పాల్గొని చిన్నారులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పసి పిల్లలను తల్లిదండ్రులు అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరారు. మే 2వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కిశోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమం ముగిసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, మహిళ పోలీసులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

జూవెల్ అప్రైజర్ కుటుంబానికి సాయం



కిరణ్‌కుమార్ భార్య సుకన్యకు ఆర్థిక సహాయం చెక్కు అందచేస్తున్న ఆర్ఎం మోహన్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఏకే నగర్ బ్రాంచిలో అప్రైజర్‌గా పనిచేస్తూ ఆకస్మికంగా మరణించిన కిరణ్ కుమార్ కుటుంబానికి రూ.1.20లక్షల ఆర్థిక సహాయ చెక్కును మంగళవారం అందచేశారు. ఏపీజీబీ జువెల్ అప్రైజర్స్ యూనియన్ సేకరించిన ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును బ్యాంకు నెల్లూరు ఆర్ఎం మోహన్‌రెడ్డి మంగళవారం ఏపీజీబీ కార్యాలయంలో అప్రైజర్ భార్య సుకన్యకు అందచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి రామవేంద్రాచారి, చిరంజీవి పాల్గొన్నారు.

వృద్ధులు, నిరాశ్రయులను ఆదరించాలి



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మన చుట్టూ ఉన్న వృద్ధులు, నిరాశ్రయులను ఆదరించడం మనందరి బాధ్యత అని శ్రీపొట్టిశ్రీరాములు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సింగంశెట్టి మురళీ మోహన్‌రావు అన్నారు. మంగళవారం పాత మున్సిపల్ కార్యాలయంలోని వృద్ధాశ్రమంలో యువ గాయకుడు అబ్దుల్ మసీద్ జన్మదినం సందర్భంగా అన్నదానం చేశారు. మురళీ మోహన్ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు వృద్ధులను గౌరవించడం, సేవ చేయడం వంటివి నేర్పించాలని కోరారు. మన ఇంటిలో జరిగే శుభకార్యాలను వృద్ధ, అనాథాశ్రమాల్లో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ జయప్రకాష్, బలరామయ్య నాయుడు, రమాదేవి, పప్పు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా కొడుతున్న వైద్యుడిపై చర్యలు తీసుకోండి

● జీజీహెచ్ డీసీకి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఫిర్యాదు



డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ

నెల్లూరు (వైద్యం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో న్యూరో సర్జన్ డాక్టర్ దినేష్‌కుమార్ విధులకు సక్రమంగా హాజరు కావటం లేదని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం జీజీహెచ్ డిప్యూటీ కలెక్టర్ మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ మడపర్తి శ్రీనివాసులు మాట్లాడుతూ డాక్టర్ దినేష్ కుమార్ విధులకు సక్రమంగా రావటం లేదని, దీంతో ఎంతో మంది రోగులు వైద్యుడు లేక వెనుతిరిగి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విధులకు డుమ్మా కొడుతున్న వైద్యుడిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లికార్జున, బ్రహ్మానందరెడ్డి, మొగరాల సురేష్, అబిదా సుల్తాన తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకపోతే అనధికార కట్టడాలే!

● కమిషనర్ నందన్



డ్రైనేజీ కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కార్పొరేషన్ అనుమతి ఉన్న మేరకే భవన నిర్మాణాలు జరగాలని, అంతకు మించిన వాటిని అనధికార కట్టడాల కింద గుర్తించాలని సిబ్బందికి నగర కమిషనర్ నందన్ సూచించారు. ఆయన మంగళవారం 33వ డివిజన్ నేతాజీ నగర్‌లో పర్యటించారు. స్థానికంగా జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించిన తర్వాత భవన నిర్మాణాలు, వాటి అనుమతులపై ఆరా తీశారు. రీసర్వేలో భాగంగా ప్రతీ భవనాన్ని లెక్కకట్టాలని, రెవెన్యూ దుర్వినియోగం ఎక్కడా జరగకూడదని ఆదేశించారు. రోడ్డు ఆక్రమణలను సహించబోమని స్పష్టం చేశారు. అనంతరం పత్తేఖాన్‌పేటలో జరుగుతున్న కాలువల పూడికతీత పనులను పరిశీలించారు.

దినేష్‌రెడ్డితో జనసేన నాయకుల భేటీ

నెల్లూరు(క్రైం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో జనసేనపార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న నిర్ణయాలు, పలు అంశాలపై చర్చించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, నగర కార్యదర్శి జొన్నలగడ్డ హేమచంద్ర యాదవ్, పసుపులేటి శరవణ, మౌనిష్ పాల్గొన్నారు.



దినేష్‌రెడ్డికి ఫలగుచ్ఛం అందజేస్తున్న జనసేన నాయకులు

159 పొగాకు బేళ్లు తిరస్కరణ

కలిగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 472 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 313 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-139, ఆర్ఆర్-5, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 159 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.234.28గా నమోదైంది.

విజిలెన్స్ కమిటీ ఇళ్ల నిర్మాణాల పరిశీలన



ఇళ్ల నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలను చూపిస్తున్న బీజేపీ నేత మిడతల రమేష్

నెల్లూరు (జడ్పీ), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి విజిలెన్స్ అధికారుల బృందం (హై లెవెల్ విజిలెన్స్ కమిటీ) మంగళవారం నెల్లూరులోని ప్రభుత్వ లేఅవుట్లను పరిశీలించింది. బీజేపీ నాయకుడు మిడతల రమేష్ విజిలెన్స్ బృందాన్ని కలిసి క్షేత్రస్థాయిలో జరిగిన అవినీతి, అక్రమాలను తెలియజేశారు. పేదల ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించలేదని, కేంద్ర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారని వివరించారు. మెటీరియల్ లేకుండానే కాంట్రాక్టర్లకు ఫైనల్ బిల్లులు చెల్లించిన ఇళ్లను చూపించారు. దీని వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు జరుగుతున్న నష్టాన్ని వివరించారు. కేంద్ర నిధులతో లబ్ధిదారులకు నాణ్యమైన ఇల్లు అందించమని కోరితే తమపై కొందరు హౌసింగ్ అధికారులు వ్యక్తిగత ద్వేషాన్ని పెంచుకున్నారని రమేష్ ఆరోపించారు.

ముగిసిన కూచిపూడి వర్క్‌షాపు



కూచిపూడి అవగాహన సదస్సు ముగింపు కార్యక్రమంలో నృత్య కళాకారులు, నిర్వాహకులు

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : క్లాసికల్ కల్చరల్ రిసోర్స్ ఫౌండేషన్, శ్రీనందికేశ్వర కూచిపూడి కళాక్షేత్రం నగరంలోని మూడు రోజులు నిర్వహించిన కూచిపూడి వర్క్‌షాపు మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమం మాగుంట లేఅవుట్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగింది. వర్క్‌షాపులో చిన్నారులకు భారతీయ సంస్కృతి, సాంస్కృతిక కార్యక్రమాలైన సంగీతం, నృత్యం, యోగా, నటన, లలిత కళలు, హస్తకళలు, భాష తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముగింపు సందర్భంగా ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అలరించింది. ఈ కార్యక్రమంలో క్లాసికల్ కల్చరల్ రిసోర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు సతీష్ మిశ్రా, పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ మురళీమోహన్‌రాజు, ఫారెస్టు రేంజర్ మాల్యాద్రి, నర్తకి చెన్నారెడ్డి శరణ్యారెడ్డి, చెన్నారెడ్డి బాలశ్రీధర్‌రెడ్డి, జ్యోత్స్న పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కందుకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో అవగాహన లేని ప్రజల వల్ల జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టాలని పందలపాడు గ్రామ సర్పంచు కే.పద్మావతి అన్నారు. మంగళవారం పందల పాడు గ్రామ సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సచివాలయం మహిళా పోలీసు గిరిజ మాట్లాడారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, వివాహం అనంతరం గర్భధారణ ప్రారంభంలో ప్రాణాంతక పరిస్థితులను కూడా ఎదుర్కొవలసి వస్తుందన్నారు.



వింజమూరులో తెలుగు మహిళల మానవహారం



కోవూరులో ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

సాక్షి చానల్‌ను బ్యాన్ చేయాలి

● అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు హేయం ● కావలిలో మహిళల నిరసన ర్యాలీ

కావలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అమరాతి మహిళల పట్ల అనుచితంగా మాట్లాడి వారి మనోభావాలను దెబ్బతీసిన జర్నలిస్ట్ ముసుగులో ఉన్న వ్యక్తులు, విశ్లేషకులు, సాక్షి మీడియా యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కూడా జిల్లావ్యాప్తంగా ఎన్డీఏ కూటమి మహిళా నేతలు ఆందోళనలు చేశారు. కావలిలో తెలుగు మహిళా అధ్యక్షురాలు అర్షియా బేగం ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన మహిళా నేతలు, మహిళా సంఘాలు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మాగుంటపార్వతమ్మ ట్రంకురోడ్డులోని ఐలవ్‌యూ కావలి సెల్ఫీ పాయింట్ నుంచి ఏరియా వైద్యశాల వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు మహిళలు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నిరసన తెలిపి సాక్షి యాజమాన్య చర్యలను దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకురాలు అంచిపాకల కమల, టీడీపీ నేతలు గుంటుపల్లి శ్రీదేవి చౌదరి, పోతుగంటి అలేఖ్య, పద్మావతి శ్రీదేవి, మనోరమ టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కావలి : అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

● **కందుకూరు :** తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళల ఎన్టీఆర్ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో సాక్షి పత్రికను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాక్షి మీడయాను రాష్ట్రంలో నిషేధించాలని, అమరావతి మహిళలపై సొకబారు విమర్శలు చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కల్లూరి శైలజ, ముచ్చు లక్ష్మీరాజ్యం, అల్లం సుమతి, కంసాని మయూరి, ఎన్వీ రమణయ్య, చదలవాడ కొండయ్య, జనిగర్ల నాగరాజు పాల్గొన్నారు.

● **వింజమూరు :** పట్టణంలోని స్థానిక బంగ్లా సెంటర్ నుంచి కొత్త బస్టాండ్ సెంటర్ వరకు మహిళా నాయకులు భారీ ర్యాలీ నిర్వహజంచారు. సాక్షి చానల్‌కు, ప్రతినిధులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు మాట్లాడుతూ మహిళలను కించపరిచే విధంగా ప్రచారం చేసిన సాక్షి చానల్‌ను వెంటనే రద్దు చేసి మూసి వేయాలన్నారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, వైఎస్ భారతిరెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి భేషరతుగా మహిళా లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, యాకసిరి భవాని, అపర్ణ, జయలక్ష్మిలతో పాటు స్వచ్ఛందంగా మహిళలు పాల్గొన్నారు.

● **కోవూరు :** జగన్ రోత మీడియాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం మహిళలు కోవూరులో భారీ ప్రదర్శన చేశారు. స్థానిక బజారు కూడలి నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు నిర్మలానందబాబాకు వినతిపత్రం సమర్పించారు. ఆందోళనలో మండల పరిధిలోని పలు కాలనీల మహిళలు పాల్గొన్నారు.

మనుగడ ప్రశ్నార్థకం !

● జీవనోపాధి కరువై... దుర్భర జీవనంలో చేనేతలు
● వృత్తికి దూరమైన వేలాది కుటుంబాలు
● భుక్తి కోసం కూలి పనులకు..
● ఆదరణ కోల్పోతున్న నేతన్నలు
● ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



వడ్డిపాలెంలో మగ్గం నేస్తున్న కార్మికుడు



మంచం పట్టిన చేనేత వృద్ధ దంపతులు అండగుండ శేషయ్య, వెంకటరమణమ్మ

బుచ్చిరెడ్డిపాళెం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదరణ కరువై చేనేతలు మనుగడ కోల్పోతున్నారు. దీంతో జీవనోపాధి కోసం వారు వ్యవసాయ, బేల్దారి, ఇతర కూలిపనులకు వెళుతున్నారు. కోవూరు నియోజకవర్గంలోని కోవూరు, బుచ్చి, ఇందుకూరుపేట మండలాలు, వింజమూరు, సంగం, ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి ప్రాంతాల్లో వేలాది చేనేత కుటుంబాలు ఉన్నాయి. కోవూరు మండలం పాటూరులో మగ్గాలపై నేసిన చీరలకు దేశవ్యాప్తంగా పేరుంది. జిల్లావాప్తంగా ఆరేళ్ల క్రితం వరకు సుమారు 25వేల చేనేత కుటుంబాలు, 3వేలు అనుబంధ వృత్తుల చెందిన కుటుంబాలు ఉండేవి. గతంలో ప్రభుత్వాల ఆదరణ లేక ఇప్పటి వరకు 15వేలకుపైగా చేనేత కుటుంబాలు వృత్తికి స్వస్తి పలికాయి. కేవలం 9వేల కుటుంబాలు మాత్రమే నేటికీ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాయి. బుచ్చి మండలంలోనే 700 కుటుంబాలకుగాను 200 వందల కుటుంబాలు మాత్రమే వృత్తిలో కొనసాగుతున్నాయి.

● **దుర్భర జీవనం**

చాలీచాలని సంపాదనతో చేనేతలు దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారు. ఎన్ని పవర్‌లూమ్ ఉన్నా... నూలు, జరీని గంజిలో తడిపి (హ్యాండ్‌లూమ్)చేనేతలు తయారుచేసే చీరల నైపుణ్యానికి ఏవీ కూడా సాటి రావు. కానీ నేడు అవి కూడా ఆదరణ కోల్పోయాయి. వర్షాకాలంలో పనులు సాగని మూడు నెలలపాటు ప్రభుత్వం తమ జీవనభృతి కోసం ఆర్థిక సాయం అందించాలని చేనేత కార్మికులు కోరుతు న్నారు. ఆఖరికి సొంత ఇల్లు కూడా లేక అవస్తలు పడు తున్నామని వారు ఆవేదన చెందుతు న్నారు. తమ పిల్లలను ఉన్నత చదువులు కూడా చదివించుకోలేని దుస్థితిలో ఉన్నామని వడ్డిపాళెంకు చెందిన ఈతల వెంకట రమణయ్య ఆవేదన వ్యక్తం చెందారు.

మంచం పట్టిన కార్మికులు

వడ్డిపాళెంలో అండగుండ శేషయ్య, వెంకటరమణమ్మ అనే వృద్ధ చేనేత కార్మికులకు పూట గడవడమే కష్టంగా ఉంది. శేషయ్యకు నెలరోజులుగా ఆనారోగ్యం బాగాలేదు. ఆయన భార్యకు బైపాస్ సర్జరీ చేశారు. వారికి ఓ కొడుకు, కూతురు కాగా, కూతురికి వివాహం చేశారు. కొడుకు చనిపోయాడు. ప్రస్తుతం ఇద్దరూ పనిచేయలేక పోవడంతో పూట గడవడం లేదు. దీంతో పలువురు చేనేత కార్మికులు, ఆయా సంఘాల నేతలు తమవంతు ఆర్థిక సాయం అందిస్తున్నారు.ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఆ దంపతులు కోరుతున్నారు.

ఈ ప్రభుత్వమైనా ఆదుకుంటుందేమో...



నెలంతా కష్టపడితే రూ.7నుంచి రూ.8వేలు సంపాదిస్తాం. చిన్న కార్యం చేయాలన్నా, ఇతర ఏ అవసరమొచ్చినా ఆసాముల వద్ద అప్పులు తెచ్చుకుని పనులు చేసి నిదానంగా తీరుస్తాం. సొంతంగా నేత నేయాలంటే పెట్టుబడి కావాలి. అధికారులు రుణాలు ఇస్తామని చెప్తారుకానీ ఆ తరువాత పట్టించుకోరు. టీడీపీ ప్రభుత్వమైనా చేనేత కుటుంబాలను ఆదుకుంటుందని అనుకుంటున్నాం.

- దాసెట్టి సన్యాసిరావు, వడ్డిపాళెం

చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలి



చేనేత సహకార సంఘాలు మూతపడ్డాక ఆసాములే నేత కార్మికులకు పని కల్పిస్తున్నారు. చేనేతలకు పెట్టుబడులు, ముడిసరుకు అందించి, వారి ఉత్పత్తులను మార్కెట్‌లో పెట్టి, నేత కుటుంబాలు అభివృద్ధి చెందేలా చొరవచూపడంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదు. చేనేత కుటుంబాలకు స్థలాలు, ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు కూడా అంతంత మాత్రంగానే అందుతున్నాయి. మగ్గాల ఆధునికీకరణ, అందుకు తగిన విధంగా పరికరాలు కొనుగోలుకు ప్రభుత్వం చేయూతనివ్వాలి.

- ఆశం సురేష్, వీవర్స్ అసోసియేషన్ నెల్లూరు పార్లమెంట్ కన్వీనర్

లోకేష్‌తోనే చేనేతలకు పూర్వవైభవం



చేనేత కార్మికులకు పూర్వ వైభవం చేకూరాలంటే మంత్రి నారా లోకేష్ వల్లే సాధ్యమవుతుంది. జిల్లాలోని చేనేత కార్మిక కుటుంబాల కోసం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అసెంబ్లీలో తన గళం వినిపించారు. దీంతో సీఎం నారాచంద్రబాబు 2017 నుంచి 2024 మార్చి వరకు చేనేతల రుణాల మాఫీకి హామీ ఇచ్చారు. 50 ఏళ్లకు పింఛన్ పునరుద్ధరణ, 100 నుంచి 200 యూనిట్ల వరకు విద్యుత్ సరఫరా ఉచితం, నేత కార్మికులకు ఆన్‌లైన్‌లో గుర్తింపు కార్డులు ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం విద్యుత్ బిల్లులు, ఆస్తుల పేరుతో పింఛన్లు, నేస్తం పథకం, రేషన్ కార్డులు తొలగిస్తే వాటిని టీడీపీ ప్రభుత్వం పునరుద్ధరించింది.

- తాళ్ల నరసింహస్వామి, చేనేత కార్మిక సంఘం నాయకుడు, బుచ్చి



యోగాసనాలు వేస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తదితరులు

యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి

జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరిలో యోగాంధ్ర కార్యక్రమానికి విశేష స్పందన

ఉదయగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : మారిన జీవన విధానానికి అనుగుణంగా ప్రతి ఒక్కరు యోగాను జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యకర జీవనాన్ని కొనసాగించాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉదయగిరిలోని రంగనాయకులస్వామి ఆలయ ఆవరణలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక యోగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ జ్యోతిప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ యోగాంధ్రలో భాగంగా పర్యాటకాన్ని పరిచయం చేస్తూ యోగా జీవనశైలి గురించి ప్రతిఒక్కరికి అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో రెండు వేల మందితో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మానసిక వత్తిడి పెరుగుతున్న సమయంలో యోగా ఒక చక్క సమాధానమని, బలమైన సందేశాన్ని ప్రజల్లోకి పంపాలనే ఉద్దేశంతో యోగాంధ్ర కార్యక్రమం చేయడం జరిగిందన్నారు. జూన్ 21న జిల్లాస్థాయిలో ప్రతివార్డు, గ్రామ సచివాలయం పరిధిలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందులో ప్రతిఒక్కరు పాల్గొనాలన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఉదయగిరిని పర్యాటకంగా తమ ప్రభుత్వ హయాంలో అందరి సహకారంతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. యోగా ప్రాధాన్యతపై అవగాహన పెంచుకుని ప్రతిఒక్కరు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఉషశ్రీ, జిల్లా నోడల్ క్రీడా సాధికారసంస్థ అధికారి యతిరాజ్, డీఎంహెచ్‌వో సుజాత, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు నాగరాజకుమారి, గంగాభవానీ, సీఈవో విద్యారమ, డీసీవో గుర్రప్ప, తహసీల్దారు సుబ్రత, ఎంపీడీవో అప్పాజీ, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

సోమశిలలో నీటి సామర్థ్యం

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి 39.840 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



నుడా చైర్మన్ కోటంరెడ్డికి కేక్ తినిపిస్తున్న మంత్రి ఆనం, పక్కన గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ తదితరులు

సేవాతత్పరత కలిగిన నేత బాలకృష్ణ

● రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
● నుడా చైర్మన్ కోటంరెడ్డి ఆధ్వర్యంలో బాలయ్య జన్మదిన వేడుకలు

నెల్లూరు (వైద్యం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ మకుటం లేని మహారాజు, సేవాతత్పరత కలిగిన నేత నందమూరి బాలకృష్ణ అని రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. నటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. ముందుగా మంత్రి ఆనం కేక్‌కట్ చేసి అందరికీ తినిపించారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేపట్టి విజయవంతం చేయటంలో కోటంరెడ్డి సిద్ధహస్తుడన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు, బాలకృష్ణతో కలిసి తాను పనిచేయటం ఎంతో అదృష్టమని వెల్లడించారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ తనలోని భయాన్ని, బాధను, పోగొట్టి ధైరాన్ని ఆత్మవిశ్వాసాన్ని నింపిన ఏకైక వ్యక్తి నందమూరి బాలకృష్ణ అన్నారు. రాజకీయంగా తాను ఎన్నో ఇబ్బందులు పడుతున్నప్పుడు బాలకృష్ణ సాన్నిహిత్యంతో ధైర్యంగా వాటిని ఎదుర్కొన్నట్లు గుర్తు చేసుకున్నారు. తల్లి ఆశయాలను తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకుని అన్ని వర్గాల ప్రజలకు సేవలందిస్తున్న వ్యక్తి బాలకృష్ణ అంటూ కొనియాడారు. బసవతారకం కేన్సర్ ఆసుపత్రికి ఎంతో మంది బాధితులను నెల్లూరు నుంచి పంపించానని వారికి ప్రాణం పోసిన వ్యక్తి బాలకృష్ణ అని వెల్లడించారు. తనకు నుడా చైర్మన్ పదవి వచ్చేందుకు చంద్రబాబు, లోకేష్‌తో బాలకృష్ణ మాట్లాడి పదవి వచ్చేలా చేశారన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ మాట్లాడుతూ కోటంరెడ్డి సూచనలతో బాలకృష్ణ తన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారన్నారు. బాలకృష్ణ, టీడీపీ నేతల ఆశీస్సులతోనే తాను గెలిచారని తెలియచేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ వీడియోలను ప్రదర్శించారు. బ్యాండ్‌మేళం, పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పోలంరెడ్డి దినేష్ రెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, చేజెర్ల వెంకటేశ్వరరెడ్డి, బాలకృష్ణ అభిమాన సంఘం గౌరవాధ్యక్షుడు ఎద్దల రవి, జనసేన నేతలు కిశోర్, నూనె మల్లికార్జున యాదవ్, రాధయ్య తదితరలు పాల్గొన్నారు.

మ్యూజియం ఏడీగా డాక్టర్ జరీనాబేగం

నెల్లూరు (సాంస్కృతికం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు పురావస్తు ప్రదర్శనశాల, పురావస్తు శాఖ సహాయ సంచాలకులుగా డాక్టర్ జరీనా బేగం నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా ఆమె విజయవాడ నుంచి నెల్లూరుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం నెల్లూరులో ఆ స్థానంలో పని చేస్తున్న గంగాధరంను విజయవాడకు బదిలీ చేశారు.

14 నుంచి జిల్లాలో యోగా ప్రదర్శన

నెల్లూరు(విద్య), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 14వతేదీ నుంచి అన్నీ చోట్ల యోగా ప్రదర్శన నిర్వహించాలని ఇన్‌చార్జి కలెక్టర్ కే కార్తీక్ అధికారులకు సూచించారు. జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లతో మంగళవారం ఆయన యోగాంధ్ర కార్యక్రమంపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతీ గ్రామంలో యోగా చేయడానికి అనువుగా ఉన్న ప్రదేశాలను గుర్తించారన్నారు. ఆయా ప్రదేశాల్లో ఇప్పటి నుంచే ప్రతి రోజూ మాస్టర్ ట్రైనర్లు, ఇతర ట్రైనర్లు యోగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 14న ప్రజలను భాగస్వాములను చేస్తూ జిల్లా వ్యాప్తంగా గుర్తించిన అన్నీ ప్రదేశాల్లో యోగా ప్రదర్శనలు జరపాలని, దీని ని విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

జాతీయ సాహస అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ 2024 సంవత్సరానికి టెన్సింగ్ నార్గే జాతీయ సాహస అవార్డు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2022, 23, 24 సంవత్సరాల్లో భూమి, నీరు, వాయువుపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధిం చిన వారి నుంచి, నైపుణ్యం ప్రదర్శించిన వారు, జీవిత సాఫల్యం సాధించిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని పేర్కొన్నారు. పూర్తి వివరాలు ఎ్రీటచీటఃజౌ.జీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, అర్హత కలిగిన వారు ఈనెల 30వతేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో నగదు బదిలీ సరికాదు

● రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

నెల్లూరు (వైద్యం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం నగదు బదిలీ విధానాన్ని అమలు చేయాలనుకోవడం సరికాదని పలు పార్టీల నాయకులు అభిప్రాయపడ్డారు. మంగళవారం నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నగదు బదిలీ, దాని ప్రభావం అన్న అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకమరాజు, మంగళం పుల్లయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం మీద కోపంతో పేదల ఆహార భద్రతపై ఆంక్షలు విధించి పేదల కడుపు కొట్టేందుకు యత్నిస్తోం దని ఆరోపించారు. డీలర్ల వద్దకెళ్లి సరుకులు తెచ్చుకునే విధానం పేదలకు సబ్సిడీ సరుకులను దూరం చేసేలా ఉందన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని కొందరు వ్యాపారులు రీసైక్లింగ్ ద్వారా బయట రాష్ట్రాలకు తరలిస్తున్నారని దుయ్య బట్టారు. రైతాంగం జిల్లా కార్యదర్శి పులిగండ్ల శ్రీరాములు మాట్లాడుతూ చౌక దుకాణాల ద్వారా 16 రకాల సరకులను పేదలకు అందిస్తే పేదవాడు కడుపు నిండా తినే అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం నగదు బదిలీ పథకాన్ని ఇందులో చేర్చటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నందిపోగు రమణయ్య, సీఐటీయూ నాయకురాలు దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, జెట్టి శేషారెడ్డి ట్రస్ట్ చైర్మన్ చంద్ర రాజగోపాల్, జిల్లా కార్యదర్శి ఎంవీ రమణయ్య, జిల్లా అధ్యక్షుడు నూకలపాటి రఘురామయ్య, నక్క రాధయ్య, ఎస్‌కే షాన్‌వాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరిన పారిశుధ్య కార్మికుల గొడవ

● నిద్రమాత్రలు మింగిన కార్మికురాలు
● కార్మికుడిపై పోలీసు కేసు

నెల్లూరు (వైద్యం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓ పారిశుధ్య కార్మికురాలిని విధుల గురించి ప్రశ్నించి న నేపథ్యంలో మొదలైన గొడవ ముదిరింది. దీనికి సంబంధించిన వివరా లు ఇలా ఉన్నాయి. గ్లోరీ అనే పారిశుధ్య కార్మికురాలు జీజీహెచ్‌లోని ఆపరేషన్ థియేటర్‌లో పనిచేస్తుంది. గత శనివారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ శ్రీనివాసులు సాధారణ పరిశీలనలో భాగంగా ఆపరేషన్ థియేటర్ వద్దకు వెళ్లారు. గ్లోరీ విధుల్లో లేకపోవడంతో అక్కడు న్న ఇతర కార్మికులను ప్రశ్నించారు. గ్లోరీ సక్రమంగా విధుల్లో ఉండదని వారు చెప్పారు. కాసేపటికి తిరిగి వచ్చిన గ్లోరీని సూపర్‌వైజర్లు ప్రశ్నించా రు. పర్మిషన్ తీసుకుని వెళ్లానని ఆమె సమాధానమిచ్చింది. ఈ క్రమంలో ఆమె బంధువు కొండా అనిల్ సూపర్‌వైజర్, ఇతర కార్మికులతో గొడవప డ్డాడు. దీంతో అనిల్‌పై దర్గామిట్ట పోలీస్ స్టేషన్‌లో పారిశుధ్య కార్మికులు కేసు పెట్టారు. అయితే ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవటంతో కార్మికులు మంగళవారం నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కొండా అనిల్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇదిలా ఉండగా గ్లోరీ వెంగళరావునగర్‌లోని తన నివాసంలో సోమవారం నిద్రమాత్రలు మింగింది. వెంటనే జీజీహెచ్‌కు తరలించి చికిత్స చేశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం బాగానే ఉంది. అయితే తనను అవమానించారం టూ ఇద్దరిపై వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఆమె మంగళవారం ఫిర్యాదు చేసింది.

రైల్లో గంజాయి స్వాధీనం

నెల్లూరు(క్రైం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని గూడూరు రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు రైల్వే డీఎస్పీ జీ మురళీధర్ మంగళవారం తన కార్యాలయంలో నిందితుని వివరాలను మీడియాకు వెల్లడించారు. సోమవారం నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో కావలి, నెల్లూరు, గూడూరు రైల్వే ప్లాట్‌ఫారమ్‌లపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. గూడూరు రైల్వే స్టేషన్‌లో ఇన్‌చార్జి ఎస్ఐ వై చెన్నకేశవరావు తనిఖీలు చేస్తుండగా టాటానగర్-ఎర్నాకులమ్ రైలు దిగి హడావిడిగా స్టేషన్ బయటకు వెళుతున్న జార్ఖండ్ రాష్ట్రం కుచాయి జిల్లాకు చెందిన దేవదాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని బ్యాగులో మూడు కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా ఒడిశాలో గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి చెన్నై పరిసర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించేందుకు వెళుతున్నట్లు తెలిపాడు. దీంతో అతనిని అరెస్ట్ చేశామని డీఎస్పీ తెలిపారు. ఈ సమావేశంలో నెల్లూరు రైల్వే సీఐ ఏ సుధాకర్, నెల్లూరు, గూడూరు ఇన్‌చార్జి ఎస్ఐలు జీ మాలకొండయ్య, వై చెన్నకేశవరావు, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ సీకేఎన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడి వివరాలు తెలుపుతున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం పంపిణీ

ఉదయగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అందజేసిన సన్నబియ్యాన్ని పంపిణీ చేసినట్లు ఎంఈవో-1 మస్తాన్‌వలి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. ఆరోజు నుంచి మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం వడ్డించాలన్నారు. నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం పాఠశాలలకు సన్నబియ్యం పంపిణీ చేసిందన్నారు.


బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9269
వెండి కిలో ధర	రూ. 109600
వెండి ఒక గ్రాము	రూ. 112.60

నిర్లక్ష్యం నీడలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్

● సిగ్నల్స్ అందక వినియోగదారుల అవస్థలు ● తుప్పుపడుతున్న సామగ్రి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గువ్వాడిలో ఏర్పాటుచేసిన బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్వహణపై అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తొలుత సక్రమంగా బాధ్యతలు నిర్వహించడంతో సమీప పల్లె ప్రజలు ఆ నెట్‌వర్క్ వైపు మొగ్గు చూపారు. క్రమేణా ఆలనా, పాలనా లేకుండా పోవడంతో సిగ్నల్స్ సైతం మొరాయిస్తున్నాయి. దీంతో ఇతర నెట్‌వర్కుల వైపు వినియోగదారులు పరుగులు తీస్తున్నారు. కార్యాలయం తలుపులు తీసే నాథుడు కూడా లేకపోవడంతో ప్రాంగణమంతా కంపచెట్లతో నిండి అడవిని తలపిస్తోంది. దీంతో విషపురుగుల ప్రభావం సైతం అధికంగా ఉండడంతో అటుగా వెళ్లాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రహరీ బయట సైతం కంపచెట్లు, పేడదిబ్బలు పేరుకుపోయాయి. సెల్‌టవర్ ఆనవాళ్లు కూడా కనిపించడం లేదని, ప్రధాన రహదారికి ఆనుకొని ఉండడంతో అటువైపు చూసిన ప్రతిఒక్కరూ రూ. లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన విలువైన సామాగ్రి తుప్పు పట్టి తుప్పుపట్టి పోతోందని, అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.


కంపచెట్లతో మూసుకుపోయిన సెల్ టవర్

స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్‌ను

సమర్థవంతంగా అమలు చేయాలి : మంత్రి ఆనం

ఆత్మకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్నిశాఖల అధి కారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. మంగళ వారం నెల్లూరులోని ఆనం క్యాంపు కార్యాలయంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్‌పై ఆయన అధికారులతో శాఖల వారీగా సమీక్షించి చేపట్టాల్సిన కార్యాచరణపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. లక్ష్యాలను చేరుకునేందుకు పక్కా ప్రణాళికతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ బి పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, చీఫ్ ప్లానింగ్ అధికారి రఘురామయ్య, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నేడు సమీక్షా సమావేశం

స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం ఉదయం 11 గంటలకు ఆత్మకూరు నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర-2047 విజన్ యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలుచేసేందుకు రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరుగుతుందని ఆనం క్యాంప్ కార్యాలయం నుంచి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమావేశంలో శాఖల వారీగా ప్రాధాన్యత కలిగిన అంశాలు, అభివృద్ధి ప్రణాళికలు, కార్యాచరణపై చర్చ జరుగుందని పేర్కొన్నారు. కావున నియోజకవర్గంలోని తహసీల్దార్లు, మండల పరిషత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఇతర శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, టిడిపి, బిజెపి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు తప్పక పాల్గొనాలని కోరారు.

న్యూస్ బాక్స్

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


హాజరు పరిశీలిస్తున్న నిర్మలాదేవి

ఉదయగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీసీ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి సూచించారు. మంగళవారం కుట్టు శిక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 90 రోజుల శిక్షణలో 80 శాతం హాజరు తగ్గకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అప్పాజీ, జిల్లా కోఆర్డినేటర్లు పద్మ, సుమతి, నిర్వాహకురాలు నాజియాతాజున్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

వింజమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నేత మంద వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వీఆర్ ఫంక్షన్ ప్లాజాలో ఉదయగిరి నియోజకవర్గ సమీక్షా సమావేశం ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పందిటి అంబేద్కర్ మాదిగ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం ప్రారంభమై జూలై 7 నాటికి 30వ సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా గ్రామ గ్రామాన ఎమ్మా ర్పీఎస్ జాతీయ జెండా దిమ్మెలను ఏర్పాటుచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్ అధ్యక్షుడు ఉదయ్‌కృష్ణ మాదిగ, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, నాయకులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎస్‌సీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్‌బాషా


అహ్మద్‌బాషాను సన్మానిస్తున్న శిష్యబృందం, తదితరులు

ఉదయగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అజ్మీర్‌లో ఆలిండియా సూఫీ సజ్జాదానషీన్ కౌన్సిల్ (ఏఐఎస్ఎస్‌సీ) ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఉదయగిరి పట్టణ వాసి అహ్మద్‌బాషా ఖాలిదిని మంగళవారం స్థానిక ఆస్థాన ఖాదరియాలో పలువురు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి జిల్లా సాధన సమితి అధ్యక్షుడు వేణుగోపాల్, జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, ప్రభుత్వ ఖాజీ అబ్దుల్‌అజీజ్, యస్థాన్ పాల్గొన్నారు.

ఘనంగా ఆత్మారామస్వామి గ్రామోత్సవం


హనుమంత వాహనంపై ఊరేగుతున్న ఆత్మారామస్వామి

సంగం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారెడ్డిపాళెంలో జరుగుతున్న ఆత్మారామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి హనుమంత వాహనంపై ఆత్మారామస్వామి ఊరేగారు. ఈ సందర్భంగా ఆత్మారామస్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హరతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

చేతిపంపులకు మరమ్మతులు చేయించాలి

వింజమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో చేతిపంపులు మరమ్మతులకు గురికావడంతో నీటికోసం అవస్థలు పడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిలు ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదని, ఆనీరు ఎప్పుడు వస్తుందో కూడా తెలియడంలేదన్నారు. సక్రమంగా సరఫరాకాకపోవడంతో మోటార్ ద్వారా తీసుకోవా ల్సి వస్తుందని, కరెంటు లేకపోతే నీరు అందడం లేదని వాపోతున్నారు. చేతి పంపులకు మరమ్మతులు చేయించక పోవ డంతో వాటి పైపులు భూమిలోనే తుప్పు పట్టి పోతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చేతిపంపులకు మరమ్మతులు చేయించి నీటిసమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు


ఉదయగిరిలో కేక్ కట్ చేసి నాయకులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయులు, నందమూరి అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అడవి పేరంటాలమ్మ గ్రామోత్సవం


ప్రత్యేక అలంకరణలో అడవిపేరంటాలమ్మ

ఉదయగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో జరుగుతున్న అడవి పేరంటాలమ్మ ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన మంగళవారం గ్రామోత్సవం ఘనంగా జరిగింది. పేరంటాలమ్మ పుట్టినిల్లయిన గడ్డంవారిపల్లి నుంచి హక్కుదారులు పాలాయిలను ఊరేగింపుగా ఆలయం వద్దకు చేర్చారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో మిట్టపల్లె, గడ్డంవారిపల్లి, జెట్టివారి పల్లి, అడవిపేరంటాలమ్మ నగర్‌లో గ్రామో త్సవం నిర్వహిచారు. మహిళలు అమ్మవారికి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, మేడేపల్లి వెంకటయ్య, చెన్నమ్మ దంపతులు అమ్మవారికి వెండి దీపారాధన ప్రమిదలు బహుకరించారు.

ఘటిక సిద్ధేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న జడ్పీసీఈవో విద్యారమ, డ్వామా పీడీ గంగాభవానీ

సీతారామపురం, జూ న్ 10 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధి లోని ఘటిక సిద్ధేశ్వరం ఆల యాన్ని జడ్పీసీఈవో విద్యారమ, డ్వామా పీడీ గంగా భవాని మంగ ళవారం సందర్శించారు. ఘటిక సిద్ధేశ్వర స్వామి కి, ఇష్టకామేశ్వరి అమ్మవారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందచేశారు.

కోటేశ్వరస్వామికి వైభవంగా రావణసేవ


గ్రామోత్సవంలో కోటేశ్వరస్వామి

సంగం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులో జరుగుతున్న కోటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి కోటేశ్వరస్వామికి రావణసేవ వైభవంగా జరిగింది. ఈ రావణుని విగ్రహంపై గంగా పార్వతీ సమేత కోటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యుత్ శాఖ డీఈఈగా భానునాయక్



ఆత్మకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు డివిజన్ ఏపీఎస్‌పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా ఎం భానునాయక్ నియమితులయ్యారు. ఆత్మకూరు డీఈఈగా పనిచేస్తున్న ఐ శ్రీనివాసులు సత్యసాయి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టెక్నికల్‌గా బదిలీ అయ్యారు. ఈక్రమంలో మంగళవారం నూతన డీఈఈగా ఎం భానునాయక్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి : పీడీ


ఉపాధి హామీ సిబ్బందికి సూచనలిస్తున్న పీడీ గంగాభవానీ

ఉదయగిరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెలాఖరు లోపు ఉపాధి హామీ సిబ్బందికి కేటాయించిన లక్ష్యాల్లో 90 శాతం అధిగమించాలని డ్వామా పీడీ గంగాభవానీ సూచించారు. స్థానిక శ్రీశక్తి భవనంలో ఉదయగిరి క్లస్టర్ పరిధిలోని అన్ని మండలాల ఉపాధి సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉపాధి పనులకు హాజరయ్యే శ్రామికులు ఉదయగిరి క్లస్టర్‌లో అధికంగా ఉన్నారన్నారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతిఒక్కరికీ పని కల్పించాలన్నారు. మేనెలలో వర్షాలు కురిసినందున ఆశించిన మేర లక్ష్యాలు పూర్తిచేయలేదన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు కూడా తక్కువగా ఉన్నందున ఎక్కువమంది పనులకు హాజరయ్యేలా చూడాలన్నారు. జూన్, జూలై మాసాల్లో ఎక్కువగా పనులు చేయిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ మృదుల, ఎంపీడీవో అప్పాజీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం


'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'లో పాల్గొన్న అసిస్టెంట్ మేనేజర్ రాజకుమార్

ఆత్మకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం అని ఆత్మకూరు డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజకుమార్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో మంగళవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమంలో ప్రయాణికులు పలు సమస్యలను తమ దృష్టికి తెచ్చారన్నారు. ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కాగా, బస్సుపాస్‌ల ఐడి, టికెట్స్ కొత్తగా రావడం వలన బుధవారం నుంచి మూడురోజుల పాటు బస్సు పాస్ కౌంటర్ మూసివేయడం జురుగుందన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి యథావిధిగా కౌంటర్ తెరవబడుతుందని, కావున ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలోని విద్యార్థులు, సీజన్ బస్సు పాసులు కలిగిన వారు సహకరించాలని కోరారు.

సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన అవసరం

ఏఎస్ పేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అనుమసముద్రం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం నెల్లూరు వారి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ భారతి వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ డివికే నాగేశ్వరావు పాల్గొని వ్యవసాయంలో సాంకేతిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం నెల్లూరు శాస్త్రవేత్త డాక్టర్ మధుసూదన్ నూతన వరి వంగడాలు, యాజమాన్య పద్ధతులపై అవగహన కల్పించారు. ఎస్‌వి పశువైద్య విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ సురేష్‌బాబు పశుపోషణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవో గీత, ఎఈవో భాగ్యలక్ష్మి, వీఏఏ శ్రీహరి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కస్తూరి, ఎపిఎం శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

చిన్న వయసులో పెళ్లిళ్లు చేస్తే చర్యలు తప్పవు


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో పద్మావతి

అనంతసాగరం జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిలకు చిన్న వయస్సులో పెళ్లిళ్ల చేస్తే చట్టరీత్యా నేరమని, అలాచేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని సీడీపీవో పద్మా వతి తెలిపారు. మండలంలోని లక్క రాజుపల్లి, మంచాలపల్లి గ్రామాల్లో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా కౌమర దశలో బాలికలకు పలు సూచనలు చేశారు. ఈదశలో పలు మార్పులు వస్తా యని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కా ర్యక్రమంలో సూపర్‌వైజర్ శారద పాల్గొన్నారు.

● **ఏఎస్ పేట :** బాలికలు చదువుకోవడం ద్వారా బాల్య వివాహాలను అరికట్టవచ్చని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక అంగన్ వాడీ కేంద్రంలో కిశోర బాలికల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, సమస్యల గురించి వివరించారు. బాలికలకు విద్య అవసరంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె విజయలక్ష్మి, ఎం సుశీలమ్మ, పి షాకిరాబేగం, పి సావిత్రి, జి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వింజమూరులో కంటి వైద్య శిబిరం

వింజమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైఆర్ జూనియర్ కళాశాలలో శేగు సుబ్బారావు, నిర్మలాదేవి, ఎన్ఆర్ఐ శేగు సతీష్ దాతృత్వంతో జూన్ 6 నుంచి నిర్వహిస్తున్న శంకర నేత్రాలయం చెన్నై వారి ఉచిత కంటి వైద్య శిబిరం మంగళవారం ఐదో రోజుకు చేరింది. ఇందులో భాగంగా చెన్నై నుంచి వచ్చిన శంకర నేత్రాలయం కంటి వైద్య నిపుణుడు డాక్టర్ గజేంద్రకుమార్ వర్మ మాట్లాడుతూ 27 మందికి కంటి శస్త్రచికిత్సలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర నేత్రాలయం ప్రజా సంబంధాల అధికారి రంజిత్‌కుమార్, ఎంపీటీసీ వనిపెంట హైమావతి, వనిపెంట సుబ్బారెడ్డి, నిర్వాహకులు యల్లాల రఘురామిరెడ్డి, పలుకూరు వెంగయ్య, మందాడి శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

కప్పరాళ్లతిప్పలో పోలీసుల కార్డెన్ సెర్చ్

● 32 బైకులు, మూడు ఆటోల స్వాధీనం


పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలు ఇస్తున్న కావలి డీఎస్పీ శ్రీధర్

బిట్రగుంట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కప్పరాళ్లతిప్పలో కావలి డీఎస్పీ పీ.శ్రీధర్ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందితో కలసి మంగళవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తెల్లవారు జామున 4.30 నుంచి ఉదయం 7 గంటల వరకు తిప్పలోని ప్రతి ఇంట్లో సోదాలు చేపట్టారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని 32 మోటారు బైకులు, మూడు ఆటోలను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించామని తెలిపారు. ముఖ్యంగా అనుమానిత వ్యక్తులు, గంజాయి లాంటి మారకద్రవ్యాలు ఏమైనా ఉన్నాయా అని తనిఖీలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కావలి సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు బీ.పాపారావు, గిరిబాబు, రాజేశ్వరరావు, ఫిరోజ్, స్థానిక ఎస్ఐ బోజ్యా, వివిధ స్టేషన్లకు చెందిన 8 మంది ఎస్ఐలు, 60 మంది సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థిపై కత్తితో దాడి


చికిత్స పొందుతున్న జాషువా డేనియేల్

బిట్రగుంట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఓ ఐటీఐ విద్యార్థిపై కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి బోగోలు కుమ్మరివీధిలో జరిగింది. దీనిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ భోజ్యా తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఇంటి పరసరాల్లో డైపర్ వేశారన్న నెపంతో కుమ్మరవీధిలో నివాసం ఉంటున్న బోగిరి కన్నమ్మపై ఆదివారం అదే ప్రాంతానికి చెందిన ప్రభుకుమార్ కుటుంబ సభ్యులు దుర్భాషలు ఆడారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరగగా స్థానికుల చొరవతో సర్దుమణిగింది. ఈ క్రమంలో సోమవారం రాత్రి బోగోలు నుంచి ఒంటరిగా వస్తున్న కన్నమ్మ మనవడు రాగాల జాషువాడేనియేల్‌పై ప్రభుకుమార్ కత్తితో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలైన ఆ యువకుడి కేకలతో చుట్టుపక్కల వారు రావడంతో ప్రభుకుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఉద్దేశపూర్వకంగానే హత్య చేసేందుకే కత్తితో దాడి చేశాడని బాధితుని తండ్రి సోమేశ్వరరావు అంటున్నారు. నిందితుడు ప్రభుకుమార్ కోసం పోలీసులు గాలింపులు చర్యలు చేపట్టారు.

తల్లిని బాగా చూసుకోమన్నందుకు

తమ్ముడిపై అన్న దాడి : గాయాలు

నెల్లూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తల్లిని బాగా చూసుకోమన్నందుకు తమ్ముడిపై అన్న దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. నెల్లూరు రూరల్లోని సౌత్‌మోపూరు పంచాయతీ మొగళ్లపాళెం రోడ్డు వద్ద ఈ ఘర్షణ జరిగింది. రూరల్ సీఐ గుంజి వేణు అందించిన వివరాల మేరకు... సైదాపురం మండలం కృష్ణారెడ్డిపల్లెకు చెందిన కుంచెం అంకయ్య (32) నెల్లూరు శివార్లలోని కొత్తూరు వద్దనున్న వల్లూరమ్మ కాలనీలో నివాసముంటున్నాడు. అతని తల్లి సొంతూరులోని సోదరుల వద్ద జీవిస్తోం ది. ఆమెను సోదరులు సరిగా చూడటం లేదని తెలుసుకున్న అంకయ్య సోమవారం తన స్నేహితులు శీను, హరితో కలిసి కారులో సొంతూరుకు వెళ్లి సోదరులను మందలించి తిరుగు ప్రయాణమ య్యాడు. పొదలకూరు రోడ్డు నుంచి మొగళ్లపాళెం వెళ్లే కూడలి వద్ద కాసేపు ఆగారు. అయితే తమ్ముడిని వెంటాడుతూ అతని అన్న (ఆయన పేరు కూడా అంకయ్యే), ఆయన స్నేహితులు సింహరి, శీను, ఏడుకొండలు అక్కడికి వచ్చి తమ్ముడు అంకయ్యపై కర్రలతో విచక్షణ రహితంగా దాడి చేసి పరారయ్యారు. తలపై తీవ్రగాయాలైన తమ్ముడు అంకయ్య, తన స్నేహితుల సహాయంతో నగరంలోని బొల్లినేని ఆసుపత్రిలో చేరాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని బోడిగాడితోట ప్రభుత్వ వైద్యశాల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆ ప్రాంతంలో సోమవారం రాత్రి అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని స్థాని కులు 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మంగళవారం సమాచారం అందుకున్న 5వ వార్డు వీఆర్వో భాస్కరయ్య నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృతి చెందిన వ్యక్తి కొంతకాలంగా మద్యం సేవించి బోడిగాడితోట పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ ఉండేవాడని స్థానికులు పోలీసులకు తెలిపారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని భర్త ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): భార్య అలిగి పుట్టింటికి వెళ్లిందన్న మనస్థాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో రబ్బానీ (30), మమూల దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు. రబ్బానీ తన ఇంటి పక్క వీధిలో టిఫిన్ అంగడి నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను భార్య, పిల్లలను పట్టించుకోకపోవడంతో దంపతుల మధ్య నమస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ నెల 8న వారి మధ్య గొడవ జరగడంతో భార్య అలిగి పిల్లలను తీసుకుని శ్రీనివాసనగర్ లోని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం రబ్బానీ ఉరేసుకుని మృతి చెందాడు. అతని స్నేహితుడు అక్బర్ అలియస్ ఇక్బాల్ సమాచారంతో భార్య, బంధువులు ఇంటికి చేరుకున్నారు. మమూల ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

పాత గొడవలతో ఒకరిపై దాడి

నెల్లూరు(క్రైం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై కొందరు దాడిచేసిన ఘటన మంగళవారం వెంగళరావ్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని వెంగళరావ్‌నగర్‌కు చెందిన ఏ ప్రభుకు అదే ప్రాంతానికి చెందిన వాసుతో గొడవలున్నాయి. ప్రభు మంగళవారం తన మేనత్త మేరి ఇంటికి వెళ్లగా అక్కడకు చేరుకున్న వాసు, అతని కుటుంబ సభ్యులు, బంధువులు ప్రభుపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్థలం విషయమై ఇరువర్గాల ఘర్షణ

బిట్రగుంట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : అల్లిమడుగు పంచాయతీ కడనూతల ఇందిరమ్మ కాలనీలో మంగళవారం ఓ స్థలం విషయమై ఇరువర్గాలు దాడులకు దిగాయి. ఈ దాడుల్లో నాటకరాణి సురేంద్ర, సునీత, వేణు గాయపడటంతో కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కావలి రూరల్ సీఐ పాపారావు క్షతగాత్రులతో మాట్లాడారు. సీఐ మాట్లాడుతూ కాలనీలో ఉన్న స్థలాన్ని శుభ్రపరిచే విషయమై అదే కాలనీకి చెందిన నాటకరాణి బాబు, నాటకరాణి సురేంద్రల మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిపారు. మాట మాట పెరిగి సురేంద్ర, సునీత, వేణులపై బాబు దాడి చేసినట్లు బాధితులు చెప్పారని తెలిపారు. అయితే ఈ దాడిలో బాబుతోపాటు ఈయన భార్య శైలజ కూడా గాయపడి, కావలి ప్రభుత్వ వైద్యశాలలో చేరారని తెలిపారు. ఎస్ఐ భోజ్యా విచారిస్తున్నట్లు పేర్కొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 550

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ

కొండాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంపై మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 ఆనందరావు పాల్గొని మాట్లాడుతూ నూతన మెనూను తెలియచేసి ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలకే సన్నబియ్యం నేరుగా సరఫరా చేస్తుందన్నారు. మండలంలో ఉన్న 62 మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులు నిబంధనలు పాటించాలన్నారు.

159 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం రైతులు మొత్తం 472 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 313 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-139, ఆర్‌ఆర్-5, సీఆర్-8, జంపింగ్‌లాట్స్-7 కారణాలతో 159 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.180, సగటు ధర రూ.234.28గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి టి.ఇసాక్‌స్వరన్‌దత్ తెలిపారు.

న్యూస్ బాక్స్

రైల్వే పీడబ్ల్యూఐ అధికారులకు సన్మానం

బిట్రగుంట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బిట్రగుంట రైల్వే పీడబ్ల్యూఐ అధికారులను బిట్రగుంట పెన్షనర్ల అసోసియేషన్ వర్కింగ్ చైర్మన్ నూకసాని శ్రీనివాసులుయాదవ్, సెక్రటరీ గోవిందరాజులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కొన్నేలుగా బిట్రగుంటలో పీడబ్ల్యూఐగా పనిచేస్తున్న కృష్ణన్ సింగరాయకొండకు బదిలీ అయ్యారు. ఆ స్థానంలో రాజమండ్రిలో పనిచేస్తున్న రాజకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారిద్దరిని శాలువతో సన్మానించారు.

ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటు

దగదర్తి(బిట్రగుంట), జూన్ 10(ఆంధ్రజ్యోతి): దగదర్తి మండల సచివాలయంలో ఎస్టీల కోసం నెల్లూరు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దారు పీ.కృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పరిశీలించారు. మండలంలో 600 మందికి పైగా ఎస్టీలకు ఆధారు కార్డులు లేవని తహసీల్దారు పేర్కొన్నారు. ఐదురోజుల పాటు ఆధార్ నమోదు సెంటర్ నిర్వహిస్తామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

తహసీల్దారు సీతామహాలక్ష్మి బదిలీ

లింగసముద్రం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారు సీతామహాలక్ష్మి కందుకూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో డీఏవోగా బదిలీ అయ్యారు. ఈ మేరకు జిలా కలెక్టర్ కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు వచ్చాయి. ఆమె స్థానంలో కొండాపురం తహసీల్దారు ఎం కోటేశ్వరరావును నియమించారు.

ముగిసిన 'కిశోర వికాసం'


అల్లూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : అల్లూరులో గత నెల 2వ తేదీ నుంచి ప్రారంభమైన కిశోర వికాసం సమ్మర్ క్యాంప్ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ముగింపు సందర్భంగా అల్లూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి కావలి ఐసీడీఎస్ సీడీపీవో సౌజన్య, ఎంపీడీవో రజనీకాంత్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచలవీరేంద్ర, ఏపీఎం వెంకటప్రసాద్, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇండోసోల్ కోసం మామిడి తోటలను నాశనం చేయొద్దు

కందుకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ఇండోసోల్ పరిశ్రమ కోసం ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ పరిధిలో దశాబ్దాలుగా పెంచుకొన్న మామిడి తోటలు, ఇతర తోటలను ధ్వంసం చేసేందుకు ప్రభుత్వం సిద్ధ పడడం దుర్మార్గపు చర్య అని ఆమ్ ఆద్మీ పార్టీ కందుకూరు నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన కరేడు గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. అనంతరం కందుకూరులో విలేకర్లతో మాట్లాడుతు.. కరేడు పరిధిలో ఎంతో విలువైన భూములను ఇండోసోల్ కంపెనీకి కట్టబెట్టాలనే కుట్ర తప్ప ఇందులో ఏమాత్రం హేతుబద్ధత లేదని విమర్శించారు. సోలార్ ఎనర్జీ ప్లాంట్‌కు ఎక్కడైనా నిరుపయోగమైన ఎండలు అధికంగా ఉండి పంటలు పండని భూములు కేటాయిస్తారు తప్ప ఇలా ఏటా మూడు పంటలు పండే భూములు కాదని పేర్కొన్నారు. రామాయపట్నం పోర్టు, బీపీసీఎల్ పరిశ్రమలు పూర్తయితే తీరప్రాంతంలో భూముల విలువ భారీగా పెరగనున్నందు వల్ల ఆ భూములపై ఇండోసోల్ కంపెనీ కన్నెయడం అందుకు ప్రభుత్వం సహక రించడం అన్యాయం అన్నారు.

మేమింతే.. మారమంతే..!

- కమీషన్ల కోసం వ్యాపారులకు అండ
- రేటు పెంచుకో.. మామూళ్లిచ్చుకో...
- మద్యం దుకాణాల్లో తనిఖీలకు మంగళం
- మారని ఎక్సైజ్ అధికారుల తీరు



వలేటివారిపాలెం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు మారినా.. మద్యం పాలసీ మారినా ఎక్సైజ్ అధికారులు తీరుమారలేదన్న విమర్శలు వ్యక్తమవుతోన్నాయి. మేమింతే.. మారమంతే.. అన్న చందంగా వారి వ్యవహార శైలి ఉందని, మద్యం పాలసీలో ప్రభుత్వ నిబంధనలు అమలు చేయాల్సిన అధికారులు కమీషన్ల కోసం మద్యం దుకాణాల యజమానులతో రహస్య ఒప్పందాలు కుదుర్చుకొని కుమ్మక్కవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రేటు పెంచుకో.. నెల మామూళ్లు ఇచ్చుకో అనే రీతిన ఎక్సైజ్ అధికారులు పనితీరు ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. క్వార్టర్ సీసాపై రూ.10 అదనంగా రేటు పెంచుకొని నెల మామూళ్లు ఇవ్వాలని మద్యం దుకాణాల నిర్వాహకులకు సూచిస్తున్నట్లు తెలిసింది. నెల మామూళ్లు ముట్టుతుండడంతో షాపుల వద్ద సిట్టింగ్‌లు, బెల్టుషాపుల ఏర్పాటుకు పచ్చజెండా ఊపేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతిమంగా మందుబాబుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. వైసీపీ పాలనలో ప్రభుత్వమే మద్యం విక్రయాలు జరిపిన నేపథ్యంలో మందుబాబుల నుంచి ఏ విధమైన వ్యతిరేకత వ్యక్తమవుతందో ప్రస్తుతం అదే పరిస్థితి నెలకొంది. ఈ విషయం పాలకులకు తెలిసినా మిన్నకుండి పోతుండడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కందుకూరు ఎక్సైజ్ డివిజన్ పరిధిలో వలేటివారిపాలెం, లింగసముద్రం, గుడ్లూరు, ఉలవపాడు, కందుకూరు మండలాలు ఉన్నాయి. వలేటివారిపాలెం మండలంలో 3, లింగసముద్రం 3, గుడ్లూరు 4, ఉలవపాడు 4, కందుకూరు 4 మద్యం దుకాణాలతో పాటు 3 బార్లు ఉన్నాయి. అయితే ఒక్కో మద్యం షాపు నుంచి ప్రతి నెల ఎక్సైజ్ అధికారులు రూ.50 వేలు మామూళ్లు వసూళ్లు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇందులో హోదాలను బట్టి పంపకాలు జరుగుతున్నట్లు విశ్వశనీయ సమాచారం. ఒక్కో బార్ నుంచి నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. సగటున నెలకు రూ.12 లక్షలు మద్యం దుకాణాల నిర్వాహకులు ముట్టజెబుతున్నట్లు మద్యం యజమానులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. మద్యం పాలసీ నిబంధనలను అమలు చేయాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులపై ఉన్నా ఆశాఖ అధికారులు ఆ బాధ్యతను విస్మరించి నెల మామూళ్లకు ఒప్పందాలు కుదుర్చుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాల వైపు కన్నెతి కూడా చూడడం లేదు.

● నిబంధనలకు తూట్లు

మద్యం దుకాణాల నిర్వాహకులు మద్యం పాలసీ నిబంధనలకు తూట్లు పొడిచినా గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నా, దుకాణాల పక్కన్న అనధికారికగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నా ఎక్సైజ్ అధికారులు నుంచి ఇబ్బందులు తల్లెత్తదన్న ధీమాతో మద్యం యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. మద్యం దుకాణాల పరిధిలో ఇబ్బడిముబ్బడిగా బెల్టు షాపులు నిర్వహించుకునేందుకు నిర్వాహకులు తెరతీశారు. అంతేగాకుండా గ్రామాల్లో బెల్టుషాపులకు బహిరంగ వేలం పాటు నిర్వహిస్తున్నా పట్టించుకునేవారు లేరు.

● తనిఖీలకు మంగళం

బెల్టుషాపుల నియంత్రణ, మద్యం దుకాణాలు వద్ద సిట్టింగ్‌లకు అనుమతులు లేవు. నియంత్రించాల్సిన ఎక్సైజ్ అధికారులు నెల మామూళ్ల ఒప్పంద నేపథ్యంలో తనిఖీలకు మంగళం పాడారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆకస్మిక తనిఖీలు లేవు. మద్యం దుకాణాలు గాడి తప్పడానికి కాసులు వ్యవహరమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మామూళ్లు వసూళ్లు చేయడం లేదు

మద్యం దుకాణ యజయానుల నుంచి నెల మామూళ్లు వసూలు చేయడం లేదు. తనకు తెలియకుండా ఎవరైనా వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో బెల్టు పాపులు నియంత్రణపై దృషి పెడతాం. మద్యం దుకాణాల వద్ద సిట్టింగ్‌లకు అనుమతులు లేవు. తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం.

\- వెంకట్రావు, ఎక్సైజ్ సీఐ, కందుకూరు

రాళ్లపాడు ప్రాజెక్టు అభివృద్ధికి చర్యలు

● వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు డీఈఈ



లింగసముద్రం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాళ్లపాడు అభివృద్ధికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ముఖ్యంగా ప్రాజెక్టు పాత, కొత్త స్పిల్‌వేలలోని గేట్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నారు. కొత్త గేట్ల ముందు స్టాప్‌లాక్ గేట్ల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు పంపుతున్నట్లు డీఈ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలు, కాలువ రోడ్ల అభివృద్ధికి ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా ఉన్న చిల్లచెట్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రాజెక్టు వంతెన రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపిస్తున్నట్లు చెప్పారు.

ఈ వారం ఇంటర్వ్యూ

? రాళ్లపాడు ప్రాజెక్టు అభివృద్ధికి ఏవైనా చర్యలు తీసుకున్నారా.

! ప్రాజెక్టు కుడి ఎడమ కాలువలు, బ్రాంచి కాలువల రోడ్ల అభివృద్ధికి, ప్రాజెక్టు కట్టకు ఇరువైపులా ఉన్న చిల్ల చెట్ల తొలగింపునకు ప్రభుత్వం రూ.75 లక్షలు మంజూరు చేసింది.

? ఈ పనులు ఎప్పుడు చేపడతారు. కొత్త, పాత స్పిల్‌వేల గేట్ల మరమ్మతులు చేపడుతున్నారా.

! ప్రస్తుతం అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రిటైర్డ్ ఎస్ఈ కేవీ కృష్ణారావు, విజయవాడలోని సీతానగరం మెకానికల్ అధికారులు ప్రాజెక్టుల సెంట్రల్ డిజైనింగ్ అధికారుల బృందం గత నెల 23న ప్రాజెక్టును సందర్శించి గేట్లను పరిశీలించి, నివేదిక ఇచ్చారు. వారి సూచనల మేరకు నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిఉన్నాం.

? కొత్త స్పిల్‌వేలో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటుకు ఏమైనా చర్యలు తీసుకున్నారా.

! కొత్త స్పిల్‌వే గేట్ల ఏర్పాటుకు, గేట్ల మరమ్మతులకు, వంతెన రోడ్డు మరమ్మతులకు విడి విడిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం.

? చాలా ఏళ్ల నుంచి ఆపరేట్ చేయని పాత స్పిల్‌వే గేట్ల పరిస్థితి ఏంటి.

! ప్రాజెక్టు రెండవ గేటు కౌంటర్ వెయిట్ తప్ప మిగిలిన గేట్ల కౌంటర్ వెయిట్లు బాగున్నాయి. ప్రాజెక్టులో నీరు 4, 5 అడుగలకు తగ్గినప్పుడు ఆపరేట్ చేయాలి. ఇప్పుడు ఆపరేట్ చేస్తే నీరు వృథాగా పోతోంది.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

గుడ్లూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : గుడ్లూరు ఎస్సీ కాలనీ, గంధర్వ గిరిజన కాలనీ, ఎమ్మెస్సార్ గిరిజనకాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు అస్తవ్యస్తంగా ఉండంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. ప్రధానంగా గుడ్లూరు ఎస్సీ కానీలో తీగలు ఇళ్లమీదుగా పోతుండడంతో అవి తెగి ఎక్కడ ఇళ్లపై పడతాయేనని భయాందోళన చెందుతున్నారు. అలాగే ఎమ్మెస్సార్ గిరిజన కాలనీల్లో సరైన విద్యుత్ స్తంభాలు లేక కర్రలకు కరెంటు తీగలు బిగించుకొని ఇబ్బంది పడుతున్నామని, రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు కూడా వెలగకపోవడంతో విషసర్పాల బారిన పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. అలాగే గుడ్లూరు - పూరేటిపల్లి రోడ్డులో శివాలయం దగ్గర ఒక విద్యుత్ స్తంభం నెర్రేలు కొట్టి విరిగి కింద పడేందుకు సిద్ధంగా ఉండి, వర్షం పడే సమయంలో తరచుగా మంటలు చెలరేగుతున్నాయని వాపోతున్నారు. ఈంతో ఈ ప్రాంత రహదారిపై ప్రయాణించే వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై అనేక సార్లు విద్యుత్ అధికారులకు తెలియజేసినా ఏ ఒక్కరు పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంత వాసులు కొప్పోలు నారాయణ, వెంకటేశ్వర్లు, చిరంజీవి, మల్లికార్జున, మారుతీరావు తదితరులు తెలిపారు. ఇప్పటికైన విద్యుత్ అధికారులు స్పందించి, శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు వేయడంతోపాటు ప్రమాదకరంగా మారిన వద్యుత్ వైర్లను వెంటనే సరి చేయాలని కోరుతున్నారు.

'ఉపాధి' పనులు 200 రోజులు కల్పించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న వ్యవయసాయ కార్మిక సంఘం నేతలు

కావలిటౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనులు ఒక వ్యక్తికి 200 రోజులు కల్పించడంతో పాటు రోజుకు రూ.600 కూలీ ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు కోరారు. ఈ మేరకు మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నేత తాళ్లూరి మాల్యాద్రి, మండల అధ్యక్ష, కార్యదర్శులు సీతారామయ్య, రాధాకృష్ణయ్య తదితరులు ఎంపీడీవోను తన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పనికి రూ.2.50 కోట్లు కేటాయించాలన్నారు. వేసవి కాలంలో పని చేసే ప్రాంతంలో టెంట్లు ఏర్పాటు చేసి మజ్జిగ, మంచినీరు సరఫరా చేయాలని కోరారు. పేస్లిప్స్ ఇచ్చి ప్రతి వారం వేతనం ఇవ్వాలన్నారు. అనేక గ్రామాల్లో అన్ని తరగతుల వారికి పని సరిగా కేటాయించడం లేదన్నారు. పట్టణాల్లో ఉండేవారికి ఉపాధి హామీ పనిని ప్రవేశ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కె జాన్, నరేష్, ఆర్ సీతారామ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



కావలి : బాలకృష్ణ జన్మదిన కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, అభిమానులు, టీడీపీ నేతలు

కావలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మంగళవారం కావలిలో ఆయన అభిమానసంఘ నాయకులు ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ఉదయం కావలి ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసారు. రాత్రి ఐలవ్‌యూ కావలి సెల్ఫీ పాయింట్ వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ ఫ్యాన్స్ కావలి డివిజన్ అధ్యక్షుడు జ్యోతి బాబూరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, పలువురు టీడీపీ నేతలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

● **కందుకూరు** : బాలకృష్ణ జన్మదిన వేడుకలను కందుకూరులో పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లో టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. మూడుపూట్ల పేదలకు ఉచితంగా ఆహారం అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ముచ్చు శ్రీను, రఫీ, వీ రవిచంద్ర, బెజవాడ ప్రసాదు, చిలకపాటి మధుబాబు, చుండూరి శ్రీను, వేణు, మందపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

● **గుడ్లూరు** : నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను గుడ్లూరులో బాలయ్య బాబు అభిమానులు, టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో భారీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. బాణాసంచా కాల్చి సందడి చేశారు. బస్టాండ్ సెంటర్‌లో అల్పాహార విందు ఏర్పాటు చేశారు. అలాగే గుడ్లూరు బీసీ హస్టల్ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే కూలింగ్ వాటర్ ఫ్రిజ్‌ను అందజేశారు. డిజీ సందడితో యుకులు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనిగర్ల నాగరాజు, చెన్నారెడ్డి మహేష్, చిత్తారి మల్లికార్జున, ఉమ్మినేని సుబ్బారావు, పువ్వాడి వేణుగోపాలు, ఉన్నం వెంకటేశ్వర్లు, రావూరి వేణు, చుండి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో కూడిన వర్షం

● విద్యుత్ తీగలపై పడిన చెట్లు



జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద నిలిచిన నీరు

లింగసముద్రం, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం 5 గంటల అకస్మాత్తుగా ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు విద్యుత్ తీగలపై చెట్లుపడి, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ వర్షం సుమారు గంట సేపు కురవడంతో లింగసముద్రం, జంపాలవారిపాలెం, పెంట్రాల, వెంగళాపురం, తిమ్మారెడ్డిపాలెంతో పాటు పలు గ్రామాల్లో రోడ్లు బురదమయమయ్యాయి. లింగసముద్రం పంచాయతీలోని జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద సైడు కాలువలు లేకపోవడంతో వర్షపు నీరు పక్కనే ఉన్న పాఠశాల సమీపంలో నిలిచి పోయింది. లింగసముద్రం పాత చెరువు అలుగు సమీపంలో ఉన్న శ్మశాన వాటిక వద్ద వేపచెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. సుమారు 2 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనంతరం సిబ్బంది వేపచెట్లను తొలగించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

యోగాపై సన్నాహక సమావేశం



యోగా గురువులు, మాస్టర్ ట్రైనర్లతో సమావేశమైన మున్సిపల్ కమిషనర్

కావలి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కావలి పురపాలక సంఘం లో నిర్వహించే యోగాకు సంబంధించి యోగా గురువులు, మాస్టర్ ట్రైనర్లతో మంగళవారం కావలి మున్సిపల్ కమిషనర్ తన చాంబరులో సమావేశం నిర్వహించారు. ఈనెల 21న నిర్వహించే యోగా దినోత్సవం విజయంతానికి చేపట్టనున్న కార్యక్రమాల గురించి చర్చించి పలు సూచనలు, సలహాలు తీసుకున్నారు.

బద్రిరాజు ప్రీతంకు ప్రతిభా పురస్కారం



వెంకటమణి ప్రీతంను సత్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

కందుకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్‌లో 234 ర్యాంక్, ఎంసెట్‌లో స్టేట్ 10వ ర్యాంక్ సాధించిన కందుకూరుకు చెందిన బద్రిరాజు వెంకట మణిప్రీతంకు శ్రీరాం సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రతిభా పురస్కారం అందచేసి ఘనంగా సత్కరించారు. ప్రీతం తల్లిదండ్రులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు బద్రిరాజు నారాయణమూర్తి, రజినీ దంపతులను అభినందించారు. ఈ సదర్భంగా ప్రీతంకు వెల్ఫేర్ సొసైటీ తరుపున కాకుమాను ప్రవీణ్ వెండి పెన్నును బహుకరించారు. ఈ కార్యక్రమంలో రవ్వా శ్రీనివాసులు, చెక్కా వెంకట కేశవరావు, గుర్రం చిన్నఅల్లూరయ్య, కోట వెంకటేశ్వర్లు తదితులు పాల్గొన్నారు.

ఎస్జీటీ మాన్యువల్ కౌన్సెలింగ్‌పై ఉపాధ్యాయుల హర్షం

కందుకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి) : సెకండ్ గ్రేడ్ టీచర్ల బదీలలో వెబ్ కౌన్సెలింగ్ స్థానంలో మ్యాన్యువల్ కౌన్సెలింగ్‌కు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ నిర్ణయం తీసుకోవడంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ క్రియాశీలక పాత్ర పోషించాడని పలువురు ఉపాధ్యాయులు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్జీటీలు మ్యాన్యువల్ కౌన్సెలింగ్ కోరుకున్నారని, టీచర్ల కోరిక మేరకు మంత్రి లోకేష్ ఎమ్మెల్సీలతో సమావేశం చేయగా శ్రీకాంత్ ప్రత్యేక చొరవ తీసుకొని మంత్రిని ఒప్పించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మంత్రికి లోకేష్‌కు, ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

కందుకూరు, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో అవగాహన లేని ప్రజల వల్ల జరుగుతున్న బాల్య వివాహాలను అరికట్టాలని పందలపాడు గ్రామ సర్పంచు కే.పద్మావతి అన్నారు. మంగళవారం పందలపాడు గ్రామ సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాసం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సచివాలయం మహిళా పోలీసు గిరిజ మాట్లాడారు. బాల్య వివాహం చట్టరీత్యా నేరమని, వివాహం అనంతరం గర్భధారణ ప్రారంభంలో ఒక్కోసారి ప్రాణాంతకర పరిస్థితులను కూడా ఎదుర్కోవలసి వస్తుందన్నారు. ముఖ్యంగా బాలికలను విద్యకు దూరం చేయడం వలనే ఇలాంటి పరిణామాలకు దారి తీస్తుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన మహిళల చేత బాల్య వివాహ రహిత సమాజం కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బాల్య వివాహ రహిత సమాజం కోసం పాటుపడతామని ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

ఆక్రమణల చెరలో ప్రభుత్వ భూమి

● స్వాధీనం చేసుకోవాలని సర్పంచు వినతి

కొండాపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంట పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 18లో కోట్ల రూపాయల విలువైన 2 ఎకరాల వాగుపోరంబోకు భూమి ఆక్రమణకు గురైందని, దీనిని అధికారులు స్వాధీనం చేసుకోవాలని ఆ పంచాయతీ సర్పంచు ఎం.మల్లికార్జున తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొండాపురం గ్రామానికి చెందిన సుధాకర్ అనే వ్యక్తి భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ సర్వే చేసి పోతున్నారు తప్ప జరుగుతున్న నిర్మాణాలను అడ్డుకుని ఆ భూమిని పంచాయతీకి అప్పగించడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలో ఉన్న కోట్ల విలువైన వాగు పోరంబోకు భూమిని స్వాధీనం చేసుకుని పంచాయతీకి అప్పజెప్పాలని కోరారు. ఈవిషయంపై తహసీల్దారు కోటేశ్వరారవును వివరణ కోరగా ఆ భూమిని సర్వే చేయగా కొంతవరకు ఆక్రమణకు గురైనట్లు గుర్తించి ఆక్రమణదారుడికి కట్టడాలను తొలగించాలని నోటీసు ఇచ్చామన్నారు. నోటీసు గడువు పూర్తయిన వెంటనే రెవెన్యూ అధికారులే తొలగించి భూమిని పంచాయతీకి అప్పగిస్తామన్నారు.

పంట కాలువల్లో పూడికతీత పనులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వెంగయ్యగారిపాలెం రోడ్డులో కాలువలో పూడికతీస్తున్న ఎక్స్‌కవేటర్

కావలి రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం వెంగయ్యగారిపాలెం రోడ్డులోని పంట కాలువల పూడికతీత పనులను మున్సిపల్ అధికారులు మంగళవారం చేపట్టారు. ఈ నెల 3వ తేదీన 'ఇప్పుడే ఇలా .. వర్షాలు వస్తే ఎలా?' అంటూ ఆంధ్రజ్యోతిలో పూడికతో నిండిన పంట కాలువలపై కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ వెంగయ్యగారిపాలెం రోడ్డులోని కాలువలు పరిశీలించి పూడిక తీతకు చర్యలు చేపట్టారు. రానున్న వర్షాలకు పట్టణంలో మురుగు నీటి నిల్వ లేకుండా ఉండేందుకు పాతూరు నుంచి పంట కాలువలో కలిసే మురుగునీటి కాలువలు కూడా పూడిక తీస్తూ ముందస్తు చర్యలు చేపడుతున్నారు. దీనిపై పాతూరు వాసులతో పాటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధరాత్రి పూట కరెంటు కష్టాలు!

● మూగబోయిన అధికారులు, సబ్‌స్టేషన్ ఫోన్లు ● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కావలి రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉక్కపోత, కరెంటు కోతలతో కావలి పట్టణం వైకుంఠపురం, జనతాపేట వాసులకు తరచూ రాత్రి సమయాల్లో కరెంటు కష్టాలు తప్పడం లేదు. అప్రకటిత విద్యుత్ కోతలతో ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు 2 గంటల పాటు విద్యుత్ సరఫరా లేక వీధులన్నీ గాడాంధకారంగా మారాయి. ఎక్కువగా పేదలు నివశించే వైకుంఠపురంలో విద్యుత్ కోత, ఉక్కపోతతో ఆ ప్రాంత వాసులు అర్ధరాత్రి సయాల్లో చంటటి బిడ్డలతో వీధుల్లోకి చేరాల్సి వస్తుందని వాపోతున్నారు. విద్యుత్ కోత విషయమై అధికారులకు సమాచారం చేరవేసేందుకు అనేక మార్లు అధికారులకు ఫోన్లు చేసినా బాధ్యతా యుతంగా పని చెయ్యాల్సిన సంబంధిత అధికారులు ఫోన్లు తియ్యడం లేదని అంటున్నారు. వెంగళరావునగర్‌లోని సబ్‌స్టేషన్‌కు ఎన్ని సార్లు ఫోన్లు చేసినా బిజీటోన్ తప్ప ఫోన్లు తియ్యలేదంటున్నారు. ఇబ్బందికర పరిస్థితుల్లో సమాచారం చెప్పాల్సిన అధికారుల తీరు పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

డీఎస్సీ పరీక్షలకు 1,085 మంది హాజరు

తిరుపతి(విద్య), జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఐదు కేంద్రాల్లో మంగళవారం జరిగిన మెగా డీఎస్సీ పరీక్షలకు 1,085 మంది అభ్యర్థులు హాజరయ్యారని డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. తిరుపతిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల పుత్తూరు శ్రీ వెంకటేశ్వర పెరుమాళ్, గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలు, విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ ఆర్ట్స్, ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరిగిన పరీక్షలకు 64 మంది గైర్హాజరయ్యారు.

'తోతాపురి'ని మద్దతు ధరతో కొనండి

దామలచెరువులో మామిడిరైతుల ధర్నా.



పాకాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం మామిడి కాయలను మద్దతు ధరతో కొనాలంటూ మంగళవారం మధ్యాహ్నం రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం కిలోపై రాయితీ రూ.4 ఇస్తుండగా, రూ.8కి కొనాలని కోరారు. దామలచెరువు మ్యాంగోనగర్‌లో సోమవారం ఉదయం రూ.6 వంతున కొన్నారు. సాయంత్రం రూ.4 ధర చెప్పారు. ఈ క్రమంలో మంగళవారం తక్కువ మంది రైతులే ట్రాక్టర్లలో మామిడి కాయలు తీసుకొచ్చారు. ర్యాంపుల్లో దళారులు రూ.4 ధర చెప్పడంతో ఆగ్రహిస్తూ చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారి హైస్కూల్ గేటులో రోడ్డుపై బైఠాయించారు. ర్యాంపు యజమానులు, సప్లయర్స్ ఫ్యాక్టరీలు కిలోకు రూ.8 ఇస్తే ప్రభుత్వం రూ.4 ఇస్తుందని ప్రకటించినా ఫ్యాక్టరీలు కొనడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో దళారులు సిండికేట్ అయి ర్యాంపుల్లో తక్కువ ధరకు కొని.. ఎక్కువకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. తోటల్లో పక్వానికి వచ్చిన మామిడి కాయలు రాలిపోతున్నాయని, వెంటనే కొనుగోళ్లు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. తహసీల్దారు సంతోష్‌సాయి, సీఐ సుదర్శన ప్రసాద్, ఉద్యాన అధికారిణి శైలజ రైతులతో చర్చించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. వీరు తీసుకొచ్చిన కాయలను బయట వ్యాపారులు రూ.6 చొప్పున కొన్నట్లు తెలిసింది.



శ్రీకాళహస్తి తడ రోడ్డు 6 లేన్‌గా విస్తరణ!

రేణిగుంట విమానాశ్రయం నుంచి శ్రీసిటీ ఎస్ఈజెడ్‌కు నేరుగా రోడ్డు కనెక్టివిటీ పెంచేందుకు ఉద్దేశించిన కొత్త రోడ్డు నిర్మాణ ప్రతిపాదన రద్దయింది. దానికి ప్రత్యామ్నాయంగా ఇప్పటికే ఉన్న శ్రీకాళహస్తి-తడ రోడ్డును సిక్స్ లేన్ విస్తరించే ప్రతిపాదన రూపుదిద్దుకుంటోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- సిద్ధమవుతున్న ప్రతిపాదనలు
- ఎయిర్‌పోర్టు నుంచి శ్రీసిటీకి రోడ్డు ప్రతిపాదన రద్దుతో ప్రత్యామ్నాయ చర్యలు

జిల్లాలోని శ్రీసిటీ సెజ్‌కు రేణిగుంట విమానాశ్రయం నుంచి నేరుగా రోడ్డు కనెక్టివిటీ కల్పిస్తామని ఈ ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు పలు సందర్భాల్లో ప్రకటించారు. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి ప్రతినిధులు తరచూ శ్రీసిటీకి రాకపోకలు సాగించే నేపథ్యంలో ఎయిర్ పోర్టు నుంచి త్వరగా శ్రీసిటీ చేరేలా రోడ్డు యాక్సెస్ కల్పించాలని సీఎం భావించారు. దీంతోపాటు కొత్త రోడ్డు నిర్మాణం వల్ల రేణిగుంట, శ్రీసిటీల నడుమ ఇప్పటి దాకా మారుమూల వ్యవసాయ క్షేత్రాలుగా ఉన్న ప్రాంతాలకు, అక్కడి భూములకు విలువ పెరుగుతుందని, పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడులు వస్తాయని భావించారు. కొత్తగా నిర్మించే సిక్స్ లేన్ రోడ్డును ఆధారంగా చేసుకుని ఆ మార్గంలో కొత్త పారిశ్రామికవాడలు ఏర్పాటు చేయవచ్చని కూడా తలపోశారు. దానికనుగుణంగా ఎయిర్ పోర్టు నుంచి శ్రీకాళహస్తి మీదుగా ఇప్పుడున్న మార్గంలో కాకుండా రేణిగుంట నుంచి శ్రీసిటీకి కొత్త రోడ్డు నిర్మించాలని నిర్ణయించారు. దానిపై కలెక్టర్‌తో చర్చించి సర్వే చేయించాలని ఆదేశించారు. ఇటీవల శ్రీసిటీని సందర్శించిన సందర్భంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సైతం శ్రీసిటీ నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు కనెక్టివిటీ పెంచుతామని ప్రకటించారు.

కొత్త రోడ్డు నిర్మాణానికి రూ.4 వేల కోట్లు అవసరమని అంచనా

ప్రాథమిక సర్వేలో ఎయిర్ పోర్టు నుంచి నేరుగా శ్రీసిటీకి సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణం అత్యంత వ్యయ ప్రయాసలతో కూడుకున్నదని తేలింది. ప్రతిపాదిత మార్గంలో విలువైన పంట భూములు ఉండడం వల్ల వాటికి పరిహారం కింద ఎక్కువ మొత్తం చెల్లించాల్సి ఉంటుందని వెల్లడైంది. మరోవైపు మార్గంమధ్యలో అడ్డుపడే కొండ ప్రాంతాల మీదుగా రోడ్డు నిర్మాణానికి సాధారణ అంచనా వ్యయానికి మించి అనేక రెట్లు అధికంగా ఖర్చవుతుందని తేలింది. కనీసం రూ.4 వేల కోట్లు అవసరమవుతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం చంద్రబాబుకు నివేదించారు. ఇప్పటికే రేణిగుంట నుంచి నాయుడుపేట, సూళ్లూరుపేట మీదుగా తడకు సిక్స్ లేన్ రోడ్డు కొత్తగా నిర్మాణం జరిగి ఉండడం, ఆ మార్గంలో తడకు చేరుకోవడానికి గంటన్నర సమయం మాత్రమే పడుతున్నందున మళ్లీ ఎయిర్ పోర్టు నుంచి శ్రీసిటీకి ప్రత్యేకంగా కొత్త రోడ్డు అవసరం లేదని సీఎంకు వివరించారు.

ప్రత్యామ్నాయంగా శ్రీకాళహస్తి-తడ రోడ్డు విస్తరణ ప్రతిపాదన

ఒకవేళ ప్రత్యామ్నాయం అవసరమని భావిస్తే ఇప్పటికే శ్రీకాళహస్తి నుంచి పదో మైలు, బీఎన్ కండ్రిగ, వరదయ్యపాలెం మీదుగా తడ వరకూ ఉన్న డబుల్ రోడ్డును విస్తరిస్తే సరిపోతుందని కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం చంద్రబాబుకు వివరించారు. ఈ రోడ్డును డబుల్ రోడ్డు నుంచి ఫోర్ లేన్‌గా విస్తరించేందుకు ప్రతిపాదనలు ఇదివరకే ప్రభుత్వానికి పంపించామని, సీఎం ఆసక్తి కారణంగా ఆ ప్రతిపాదనలను సిక్స్ లేన్‌కు మార్చుకుంటే సరిపోతుందని నివేదించారు. దీంతో శ్రీకాళహస్తి నుంచి బీఎన్ కండ్రిగ, వరదయ్యపాళెం మీదుగా తడ వరకు ఇపుడున్న డబుల్ రోడ్డును సిక్స్ లేన్ రోడ్డుగా విస్తరించేందుకు సర్వే చేసి ప్రతిపాదనలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. కాగా శ్రీకాళహస్తి నుంచి ఇప్పుడున్న సిక్స్ లేన్ రోడ్డు మార్గంలో తడ 75 కిలోమీటర్ల దూరంలో ఉంది. అదే శ్రీకాళహస్తి నుంచి బీఎన్ కండ్రిగ, వరదయ్యపాళెం మీదుగా తడ నడుమ దూరం కేవలం 42 కిలోమీటర్లు మాత్రమే. కేవలం గంట వ్యవధిలో శ్రీసిటీకి చేరుకునే అవకాశముంటుంది. నిర్మాణ వ్యయం కూడా భారీగా తగ్గనున్న కారణంగా ప్రత్యామ్నాయ ప్రతిపాదన పట్ల సీఎం చంద్రబాబు మొగ్గు చూపించారు. ఆ మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ శ్రీకాళహస్తి - బీఎన్ కండ్రిగ - వరదయ్యపాలెం- తడ రోడ్డును సిక్స్ లేన్ రోడ్డుగా విస్తరించేందుకు ప్రతిపాదనలు రూపొందించే పనిలో పడ్డారు. ప్రాధాన్యతా క్రమంలో ఈ పనులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే నిధులు కేటాయించే అవకాశముంది.

ఆలస్యంగా ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్



బదిలీ పత్రాన్ని అందజేస్తున్న డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా మూడు రోజుల విరామం తర్వాత మంగళవారం రాత్రి సెంకడరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)ల బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. చిత్తూరులోని షర్మన్ మెమోరియల్ బాలికల పాఠశాలలో రాత్రి 10.50గంటలకు కౌన్సెలింగ్ మొదలు పెట్టారు.డీఈవో వరలక్ష్మి ఎస్జీటీలకు బదిలీ పత్రాలను అందజేశారు.మంగళవారం సాయంత్రం 3.50 గంటలకు కౌన్సెలింగుకు హాజరు కావాలని విద్యాశాఖ అధికారులు సూచించినా, రాష్ట్రస్థాయి నుంచి ఖాళీలకు సంబంధించి అధికారిక జాబితా రాకపోవడంతో కౌన్సెలింగ్ ఆలస్యమైంది.మొత్తం 3,577మంది ఎస్జీటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.వీరిలో జడ్పీ, మండల పరిషత్ యాజమాన్యాల్లో 3190మంది టీచర్లుండగా, ప్రభుత్వ యాజమాన్యంలో నలుగురు, మున్సిపల్ యాజమాన్యంలో 214మంది, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలో 169 మంది ఉన్నారు. తొలి దశలో 350మందికి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.బుధవారం ఉదయం 10గంటలకు 351నుంచి 700వరకూ, మధ్యాహ్నం మూడు గంటలకు 701నుంచి 1000మంది ఎస్జీటీల వరకూ బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. తిరుపతి డీఈవో కుమార్, ఏడీలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.



బదిలీ కౌన్సెలింగ్ కోసం చిత్తూరు షర్మన్ స్కూల్లో చెట్ల కింద వేచివున్న టీచర్లు

నేడు శ్రీహరికోటలో యోగాంధ్ర రద్దు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గం శ్రీహరికోటలో బుధవారం జరగాల్సిన యోగాంధ్ర కార్యక్రమం వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఒక ప్రకటనలోతెలిపారు. మరో మూడు రోజు లు వర్ష సూచనలు ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

రెండో రోజూ రగిలిన మహిళలు

- అమరావతి మహిళలపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జిల్లాలో ఆందోళన



గూడూరులో నిరసన ర్యాలీ



జీవకోనలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

తిరుపతి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళల పట్ల సాక్షి టీవీ ఛానెల్ నిర్వహించిన డిబేట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేయడంపై రగిలిపోయిన తిరుపతి జిల్లా మహిళలు వరుసగా రెండో రోజూ నిరసన, ఆందోళన కార్యక్రమాలు కొనసాగించారు. తిరుపతి జీవకోనలో మహిళలు పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగారు. ఆ సందర్భంగా ఓ మహిళ పెట్రోలు పోసుకుని ఆత్మహత్యకు యత్నించగా మిగిలిన మహిళలు అడ్డుకున్నారు. నిరసన కారులు అక్కడ మాజీ సీఎం జగన్ దిష్టిబొమ్మను తగులబెట్టారు. కాగా ఏపీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ ఆధ్వర్యంలో పలువురు మహిళలు రామచంద్ర పుష్కరిణి నుంచీ టౌన్ క్లబ్ వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. వెంకటగిరిలో మహిళలు ఎంపీడీవో కార్యాలయం నుంచీ పోలేరమ్మ ఆలయం ఆర్చి వరకూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఆ సందర్భంగా సాక్షి పత్రిక ప్రతులను తగులబెట్టడంతో పాటు సాక్షి డిబేట్‌లో పాల్గొన్న కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు ఫోటోలను చెప్పులతో కొట్టారు. అనంతరం వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గూడూరులో తెలుగు మహిళలు వివేకానంద రోడ్డు నుంచీ రైల్వే స్టేషన్ రోడ్డు మీదుగా టవర్ క్లాక్ కూడలి వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. సాక్షి యాజమాన్యానికి, డిబేట్‌లో మహిళల పట్ల అనుచితంగా మాట్లాడిన వారికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం సాక్షి పత్రికలను, జగన్ ఫ్లెక్సీని దహనం చేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సతీమణి సంధ్యారాణి, తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి శ్రావణి, తెలుగు మహిళ రాష్ట్ర కార్యదర్శి నీలావతి తదితరులతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు. సూళ్లూరుపేటలో పాండురంగ వీధి నుంచీ ఆర్టీసీ బస్టాండు దాకా నిరసన ర్యాలీ చేపట్టిన తెలుగు మహిళలు అనంతరం బస్టాండు వద్ద మానవ హారంగా ఏర్పడ్డారు. సాక్షి యాజమాన్యంపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి, పలువురు తెలుగుమహిళలు పాల్గొన్నారు. సత్యవేడులో టీడీపీ పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో మహిళలు శ్రీకాళహస్తి బస్టాండు నుంచీ ఆర్టీసీ పెద్ద బస్టాండు వరకూ నిరసన ర్యాలీ నిర్వహించి సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పోలీసుల అదుపులో మధ్యప్రదేశ్ గ్యాంగ్

- చోరీలు, దోపిడీలకు పాల్పడిన ముఠా
- వేలి ముద్రలు, కనుబొమ్మల ఆధారంగా పట్టుకున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10(ఆంధ్రజ్యోతి): పలు రాష్ట్రాల్లో చోరీలు, దోపిడీలకు పాల్పడిన మధ్యప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్‌ను తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దొంగతనాలు, దారి దోపిడీలు చేయడంలో ఆరితేరిన ఈ ముఠాలోని ఇద్దరిని పట్టుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన 20 మంది బృందాలుగా విడిపోయి.. ఒక్కో టీము ఒక ప్రాంతాన్ని ఎంచుకుని దోపిడీ, దొంగతనాలు చేస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు.. గతేడాది తిరుచానూరు, గాజులమండ్యంలోని మూడు ఇళ్లల్లో బెదిరించి బంగారు నగలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, నగదు అపహరించుకుని వెళ్లినట్లు తెలిసింది. దీంతో పాటు కేరళ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాదు వంటి నగరాల్లో దోపిడీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే వీరిపై పలు ప్రాంతాల్లో పోలీసు కేసులు నమోదయ్యాయి. గతంలో కేరళ పోలీసులు అరెస్టు చేయగా, అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన వీరు మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. అందులోనూ పెద్ద, పెద్ద భవంతులు, కారు షోరూములు, ఎలక్ట్రానిక్ షోరూములను ఎంచుకుని 10 రోజుల పాటు రెక్కీ నిర్వహించాక అర్ధరాత్రి పూట చోరీలకు పాల్పడుతుంటారని పోలీసులు చెబుతున్నారు. అవసరమైతే వీరు రాష్ట్ర, జాతీయ రహదారులపై కాపుకాచి వాహనాలు ఆపి ఉంటే.. తుపాకులు, రాడ్లతో భయపెట్టి దోపిడీకి పాల్పడుతుంటారని సమాచారం.

ఎలా పట్టుబడ్డారంటే.. : తిరుపతి నగరం కాటన్‌మిల్లు.. రూరల్‌లో దామినేడు వద్ద మారుతీ కారు షోరూముల్లో సిబ్బంది కాళ్లు, చేతులు కట్టేసి రూ.7.30 లక్షలు నగదు అపహరించుకుని వెళ్లారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. ఈ ముఠాపై దృష్టి పెట్టారు. ఘటన జరిగిన ప్రాంతాల్లో వేలి ముద్రలు సేకరించారు. తిరుపతి ఫింగర్ ప్రింట్ పోలీసుల వద్దనున్న పాత నేరస్తులు, దోపిడీదారుల వేలి ముద్రలతో పరిశీలించారు. ఇందులో మధ్యప్రదేశ్‌కు చెందిన దోపిడీ దొంగ వేలి ముద్రలతో సరిపోయింది. దీంతో ఏఎస్పీ రవిమనోహరాచ్చారి ఆధ్వర్యంలో ఇద్దరు డీఎస్పీలు, మరో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, సిబ్బందిని మూడు టీమ్‌లుగా విభజించి బెంగళూరు, మధ్యప్రదేశ్‌కు ఎస్పీ హర్షవర్ధన రాజు పంపారు. అక్కడి పోలీసులతో సమన్వయం చేసుకుని దోపిడీ దొంగల మొబైల్ నెంబర్లు, ఆధార్ కార్డుల ఆధారంగా వారి కదలికలపై నిఘా పెట్టి ఇద్దరిని పట్టుకుని విచారిస్తున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు.. వీరు దాదాపు 10 ప్రాంతాల్లో దోపిడీలు, దొంగతనాలకు పాల్పడినట్లు తెలిసింది. ఇదే ముఠాలో మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు.



కడసారి కష్టాలు

కేవీబీపురం మండలం వగత్తూరు గ్రామంలో మరణించిన వారిని కాటికి తీసుకెళ్లడానికి కడసారి కష్టాలు తప్పడం లేదు. గ్రామం ఏర్పడి 70 సంవత్సరాలవుతున్నా ఇప్పటికీ శ్మశానానికి దారి లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. పొలాల మీదుగా పాడె మోసుకెళ్లే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా కార్యాలయాలు చుట్టూ తిరిగినా శ్మశానానికి దారి ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే స్పందించి తమ శ్మశానానికి దారి ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

తిరుమల అడవుల్లో అగ్నిప్రమాదం



తిరుమల శేషాచల అడవుల్లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. శ్రీవారిపాదాల మార్గంలోని అడవిలో ఒక్కసారిగా మంటలు చేలరేగాయి. ఈక్రమంలో వాహనదారులు, భక్తులు గమనించి వెంటనే ఫారెస్ట్, ఫైర్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. రెండు ఫైర్ ఇంజిన్లలో మంటలను అదుపు చేశారు. . స్వల్పంగా మంటలు చేలరేగాయని, సకాలంలో అధికారులు, సిబ్బంది స్పందించడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదని టీటీడీ పేర్కొంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీసీ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,258

తలనీలాలు సమర్పించినవారు: 33,502



'కింగ్‌డమ్'ను ఆదరించండి

- సినీనిర్మాత నాగవంశీ -



తిరుమల, జూన్10 (ఆంధ్రజ్యోతి): విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' చిత్రం జూలై నెలలో విడుదలకు సిద్ధంగా ఉందని, తప్పకుండా అందరు చూసి ఆదరించాలని కోరుకుంటున్నానని ఈ చిత్ర నిర్మాత నాగవంశీ తెలిపారు. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి ఆయన మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు నాగవంశీ మీడియాతో మాట్లాడుతూ.. సోమవారం తనవి రెండు చిత్రాల షూటింగ్ మొదలైందన్నారు. ఈసందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చినట్టు వెల్లడించారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



కోన రవికుమార్, సభ్యులు

తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ శాసనసభ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కోనా రవికుమార్, సభ్యులు, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస హరీశ్‌కుమార్, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజు, తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ శ్రీనివాస హరీశ్‌కుమార్

ఎస్వీయూ యూజీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

తిరుపతి(విద్య), జూన్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్టు వర్సిటీ డీన్ ఆచార్య కొంగర సురేంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో యూజీ సప్లిమెంటరీ 6వ సెమిస్టర్ పరీక్షలు జరిగాయని, వాటికి సంబంధించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో ఉంచినట్టు ఆయన వెల్లడించారు.విద్యార్థులు results.manabadi.co.in లింక్ ద్వారా ఫలితాలను చూడవచ్చని తెలియజేశారు.

తిరుపతి కార్పొరేషన్ పరిధి పెరగాలి

- 53వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పూర్తిచేస్తాం
- శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ రవికుమార్



తిరుపతి, జూన్10(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి కార్పొరేషన్ పరిధి పెంచాల్సిన అవసరముంది. అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతాం' అని శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతిలోని శ్రీ పద్మావతి సమావేశ మందిరంలో ఏపీ ఎస్పీడీసీఎల్, తిరుపతి స్మార్ట్ సిటీ, టూరిజం, టీటీడీ విభాగాలపై ఆయన సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ విభాగాలపై త్వరలో లోతుగా చర్చించి, అన్ని నివేదికలను స్పీకర్ ముందుంచి లోటుపాట్లను సవరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే మూడు నెలల్లో కొత్తగా 53 వేల వ్యవసాయ సర్వీసులు పూర్తి చేస్తామన్నారు. మరికొన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్లను గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్మార్ట్ సిటీకి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన గడువు మార్చికి ముగిసిందని, పనులన్నీ త్వరలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వ వాటా 50 శాతం కూడా విడుదల చేయలేదని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన 2ఆర్థిక సంవత్సర నిధులు పెండింగ్‌లో పెట్టడంతో పనులు నిలిచాయన్నారు. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చాలా వరకు భూములు కేటాయించిందని, ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్టులను వినియోగంలోకి తెచ్చి ఆదాయ మార్గాలను వెతకాలని సూచించారు. రాష్ట్రంలో 16 ఏళ్ల తర్వాత పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ తొలిసారిగా పనిచేయడం ప్రారంభించిందన్నారు. ఇది స్టాట్యూటరీ కమిటీ అని, సభ్యులందరూ అందరికీ సుపరిచితులేనని అన్నారు. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీల్లో 186 కంపెనీలు ఉన్నాయని వివరించారు. ఈ కమిటీ తాలూకు విధివిధానాలను పరిశీలిస్తే అన్ని కంపెనీలకు సంబంధించి రివ్యూ చేయొచ్చన్నారు. కంపెనీ పర్ఫామెన్స్, ఆడిట్ రిపోర్ట్, ఎఫిషియన్సీ కంపెనీ చట్టం ప్రకారం ఏర్పడినటువంటి కంపెనీలు, సొసైటీ చట్టం ప్రకారం ఏర్పడిన కార్పొరేషన్లకు సంబంధించిన ప్రతి కంపెనీ వార్షిక నివేదికలు అసెంబ్లీలో పొందుపరచాలన్నారు.

వెనామీకి వైట్ పీకల్



వైట్ పీకల్‌తో చనిపోయి ఉన్న రొయ్యలు - కోట మండలం కొత్తపట్నంలో వైట్ పీకల్ సోకిన రొయ్యలను విక్రయానికి సిద్ధం చేస్తున్నరైతులు

- లక్షల్లో చనిపోతున్న రొయ్య పిల్లలు ● ఆక్వా రైతులను నిలువునా ముంచుతున్న వాతావరణ మార్పు

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పు, ఉష్ణోగ్రతలో తేడా ఆక్వా రైతులను నిలువునా ముంచుతోంది. వెనామీ రొయ్యలకు వైట్ పీకల్ (తెల్లపారుడు) వ్యాధి సోకి లక్షల్లో పిల్లలు చనిపోతుండడంతో రైతులు లబోదిబో మంటున్నారు. సముద్రతీర ప్రాంతమైన కోట మండలంలో ప్రధానంగా వెనామీ రొయ్యలు సాగును చేస్తున్నారు. కొత్తపట్నం, శ్రీనివాసస్రతం, వావిళ్ల దొరువు, గోవిందపల్లి, దొరువుకట్ట ప్రాంతాల్లో రొయ్యలకు వైట్ పీకల్ వ్యాధి సోకి పిల్లలు చనిపోతున్నాయి. ఇదే అదునుగా బయ్యర్లు అడిగిన రేటుకు రొయ్యలను విక్రయించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● వైట్ పీకల్ లక్షణాలు

వెనామీ రొయ్య పిల్లలు 25నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకోగలుగుతాయి. అయితే రెండు రోజులు ముందు 40నుంచి 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడం, ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో వైట్ పీకల్ వ్యాధి సోకింది. దీంతో రొయ్యలు మేత తినకుండా రోజురోజుకు బలహీన పడి ఎదుగుదల ఆగిపోతోంది. ఊపిరాడక గుంటల వ్యవధిలోనే చనిపోతున్నాయి. సాధారణంగా వెనామీ రొయ్యలకు మూడు నుంచి పది గ్రాముల బరువు వరకు వైట్ పీకల్ సోకుతుంది. ప్రస్తుతం పది గ్రాముల సైజులో కూడా వైట్ పీకల్ సోకుతుండడంతో రైతులు లబోదిబో మంటున్నారు.



బాలకృష్ణ పుట్టినరోజున తిరుమలలో 650 టెంకాయల సమర్పణ

తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం టీడీపీ నాయకులు తిరుమల శ్రీవారికి 650 కొబ్బరికాయలు సమర్పించారు. పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో ఉదయం అఖిలాండం వదఅరున్నర కిలోల కర్పూరం వెలగించి, 650 కొబ్బరికాయలు సమర్పించారు. నందమూరి బాలకృష్ణ ఆరోగ్యంగా ఉండాలని, ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించాలని శ్రీవారిని కోరుకుంటూ కొబ్బరికాయలు సమర్పించామని శ్రీధరవర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపేష్ వర్మ, సుబ్బు పాల్గొన్నారు.

అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న శ్రీధర్‌వర్మ, నేతలు

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై అభయ హస్తాధీశుడి కటాక్షం

వడమాలపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారు దేవేరులతో కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై అభయ హస్తాధీశుడిగా ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివార్లను మేల్కొలిపి నిత్య కైంకార్యాలు నిర్వహించారు. ఉదయం స్వామివారు స్వర్ణభరణాలతో సర్వాలంకార భూషితుడిగా పద్మావతీ, ఆండాల్ సమేతంగా రాజమన్నార్ అలంకారంలో మాడవీధుల్లో ఊరేగారు. అనంతరం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరుడికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి సర్వాభూపాలురలను వాహనంగా చేసుకొన్న ప్రసన్న వేంకటేశ్వరుడు ప్రసన్నవదనంతో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకుల వేదమంత్రాలతో మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.





కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై దేవేరులతోకలిసి ఊరేగుతున్న శ్రీనివాసుడు

కమనీయంగా కమలానాథుడి కల్యాణోత్సవం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉభయ దేవేరులతో కమలానాథుడి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం పద్మావతీ, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరుడిని పట్టు పీతాంబరాలతో వధూవరులుగా కల్యాణం పీటంపై అధిరోహింప జేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పయ్యాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ శాస్త్రోక్తంగా ప్రసన్న వేంకటేశ్వరుడిచే ఉభయ నాంచారులకు మాంగళ్య ధారణ చేయించారు. పరిసరాలనుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి తన్మయత్వం చెందారు.



నేడు శ్రీవారి గరుడసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11న బుధవారం రాత్రి 7.00-8.30 గంటల మధ్య గరుడోత్సవం నిర్వహించనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వాహనాల రాకపోకల నియంత్రణ కోసం ఆలయం అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీబీఐ అధికారి పేరిట బెదిరింపులు

- సైబర్ నేరస్తుల ఉచ్చులో పడి రూ.1.20 కోట్లు పోగొట్టుకున్న రిటైర్డు టీచర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారినంటూ తిరుపతికి చెందిన రిటైర్డు టీచర్‌ను భయపెట్టి.. ఆమె నుంచి రూ.1.20 కోట్లను ఆన్‌లైన్ ద్వారా లాగేసుకున్న ఘటన అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. నవోదయ కాలనీలో నివాసమున్న రిటైర్డు టీచర్‌కు ఏప్రిల్ 16 నుంచి గత నెల 20వ తేది వరకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి పలు దఫాలుగా ఫోన్ కాల్స్ వచ్చాయి. తాను సీబీఐ అధికారినంటూ ఆ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. మీ ఆధార్ నెంబరు ఢిల్లీలోని కెనరా బ్యాంకులో మోసపూరితంగా ఉపయోగించి సదాఖత్ ఖాన్ అనే వ్యక్తి మానవ అక్రమ రవాణా చేస్తూ అకౌంటును వాడుతున్నాడని బెదిరించాడు. అనంతరం వీడియో కాల్ చేసి.. వెంటనే మీబ్యాంకు ఖాతాల సమాచారం ఇవ్వాలని, లేదంటే కేంద్ర దర్యాప్తు సంస్థలకు తెలియచేస్తామని భయపెట్టాడు. దీంతో ఆమె తనకున్న వివిధ బ్యాంకు ఖాతాల నుంచి ఆరు విడతలుగా దాదాపు రూ.1.20 కోట్లు సైబర్ నేరగాళ్ల అకౌంటుకు మార్చారు. దీనిపై తాను మోసపోయానని గుర్తించి ముందుగా సైబర్ సెల్ నెంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆమె అలిపిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేశారు.

ఐసర్ రసాయన శాస్త్ర ప్రయోగశాలలో అగ్నిప్రమాదం

- భయాందోళన చెందిన విద్యార్థులు, కార్మికులు ● తక్షణ చర్యలతో ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు

ఏర్పేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి వద్ద ఉన్న కేంద్రియ విద్యా సంస్థ ఐసర్ (ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్)లోని రసాయనిక శాస్త్ర ప్రయోగశాలలో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రయోగశాలలోని ఒక రెఫ్రిజిరేటర్, కొన్ని వినియోగ పదార్థాల డబ్బాల నుంచి మంటలు వెలువడ్డాయి. దీంతో ప్రయోగశాల నుంచి పొగలు అలుముకున్నాయి. ప్రమాదాన్ని గమనించిన విద్యార్థులు, ఉద్యోగులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. అధికారులు తక్షణమే స్పందించి భద్రతా చర్యలు చేపట్టారు. శ్రీకాళహస్తి, వెంకటగిరి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. పరికరాల నష్టం అంచనా వేయాల్సి ఉంది. ప్రాథమిక సమాచారం ప్రకారం అగ్నిప్రమాదం ప్రయోగశాలలో ఉన్న రిఫ్రిజిరేటర్, కొన్ని వినియోగ పదార్థాల వరకే పరిమితమైంది. ఐసర్ ప్రాంగణంలో ఉన్న అగ్నిప్రమాద నివారణ సదుపాయాలతో కేవలం ప్రయోగశాలకు మాత్రమే మంటలు పరిమితమైనట్లు తెలుస్తోంది.



ఐసర్‌లోని రసాయనిక శాస్త్ర ప్రయోగశాలలో బయటకు వస్తున్న పొగ

ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు

ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టడానికి సంస్థ స్వతంత్ర సత్య నిర్ధారణ కమిటీని(ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ) ఏర్పాటు చేయనున్నట్లు ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య తెలిపారు. ఈ కమిటీ విచారణ జరిపి నివేదిక అందించనుంది.

వేరుశనగ విత్తనాల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూన్ 10(ఆంధ్రజ్యోతి): వేరుశెనగ విత్తనాల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వేరుశెనగ విత్తనాలను విస్తారంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, తిరుపతి రూరల్‌లో 40 శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్‌కార్డుతో విత్తనాలను తీసుకోవాలని సూచించారు.

టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాలకు అనుమతులపై కమిటీ

- అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు



తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): టిటిడి ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై వివిధ శాఖల అనుమతుల విషయంలో సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు సూచించారు.టీటీడీలోని వివిధ శాఖల ఉన్నతాధికారులతో తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, ఇతర ఇంజినీరింగ్, మౌళిక సదుపాయాలపై టీటీడీ ఉన్నతాధికారులు చర్చించాలన్నారు. దిగువస్థాయిలో సమస్యలపై సీనియర్ అధికారులు చర్చించి పరిష్కరించాలని, ప్రభుత్వం స్థాయిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. జీఎన్సీ, ఎస్వీ పూర్‌హోం, కేటీ, వినాయకనగర్, రామనగర్ ప్రాంతాల్లోని టీటీడీ క్వార్టర్స్‌లో డ్రైనేజీ సమస్యలు, భవనాల లీకేజీలు, విద్యుత్ తదతర సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డీఎల్వో వరప్రసాద్‌రావు, డిప్యూటీఈవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాప్ బోర్డులో క్రీడాకారిణి రజనికి స్థానం



తిరుపతి(క్రీడలు), జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) బోర్డులో హాకీ క్రీడాకారిణి రజనికి చోటు లభించింది. మంగళవారం ప్రభుత్వం శాప్ బోర్డు సభ్యులను ప్రకటించింది. ఇందులో ఎర్రావారిపాళెం మండలం ఎనుములవారిపల్లెకు చెందిన రజనీకి అవకాశం కల్పించింది. ఈమె హాకీలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ ప్రదర్శించింది. గతేడాది ఎఫ్ఐహెచ్-5 ఎస్ వరల్డ్‌కప్‌లో సిల్వర్‌మెడల్, 2022 కామన్వెల్త్‌గేమ్స్, ఏసియాకప్‌లో బ్రాంజ్ మెడల్, టోక్యో ఒలంపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. 2020లో జరిగిన టోక్యో ఒలంపిక్స్ ప్రాతినిధ్యం వహించింది. గడిచిన 15ఏళ్లుగా హాకీలో రాణిస్తూ జిల్లా, రాష్ట్రంతో పాటు దేశానికి పేరుతెచ్చింది. ఆమె సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక శాప్ బోర్డులో స్థానం కల్పించింది. ఈ సందర్భంగా రజనిని పలువురు క్రీడా ప్రముఖులు అభినందించారు.


వీఆర్‌కు వెంకటగిరి ఎస్ఐ


వెంకటగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎస్ఐ సుబ్బారావును వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఉత్తర్వులు మంగళవారం జారీ చేశారు. ఎస్ఐ సుబ్బారావు ఓ న్యాయవాది పట్ల దురుసుగా వ్యవహరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఎస్ఐని వీఆర్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

ముగిసిన గోవిందుడి బ్రహ్మోత్సవాలు



తిరుపతి అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గోవిందరాజ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి జరిగిన చివరి ఘట్టంతో ముగిశాయి. ఉదయం పల్లకిపై స్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం కపిలతీర్థంలోని ఆళ్వార్ తీర్థానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అక్కడ స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుష్కరిణిలో కనుల పండువగా చక్రస్నానంనిర్వహించారు. తర్వాత పరిపాలన భవనం ఎదుట పీఆర్ తోటకు వేంచేశారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు. రాత్రి శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి





అమరావతిపై విషం కక్కడం తగదు



సాక్షి మీడియాకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేస్తున్న టీడీపీ

సూళ్లూరుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిపై విషం కక్కడం తగదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి అన్నారు. అమరావతి, ఆ ప్రాంత మహిళల పట్ల సాక్షి టీవీలో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం టీడీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. స్థానిక పాండురంగస్వామి గుడి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు టీడీపీ నాయకులు, మహిళలు నిరసన ప్రదర్శన నిర్వహించిచారు. బస్టాండు సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. సాక్షి చానల్‌లో మహిళలను కించపరిచే విధంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రాజధాని ప్రాంత మహిళలకు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, సుబ్రమణ్యం, బండారు ఆంజనేయులు, కన్నెమ్మ, సుజాత, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి మీడియాది దుష్ట సంప్రదాయం



సాక్షి దినపత్రిక ప్రతులను దహనం చేస్తున్న మహిళలు

వెంకటగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): అసత్య ప్రచారాలతో దుష్ట సంప్రదాయాన్ని అనుసరిస్తున్న సాక్షి పేపర్, చానల్‌పై నిషేధం విధించాలని మహిళలు డిమాండ్ చేశారు. మంగళవారం వెంకటగిరిలో సాక్షి పత్రిక ప్రతులను దహనం చేశారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి పోలేరమ్మ ఆర్చి వరకు ర్యాలీగా వెళ్లి నిరసన ప్రదర్శన చేపట్టారు. అక్కడ సాక్షి పేపర్లు దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తనూజారెడ్డి మాట్లాడుతూ అమరావతి ప్రాంత మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన కొమ్మినే శ్రీనివాసులు, కృష్ణమ రాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీరిని ప్రోత్సహిస్తున్న సాక్షి యాజ్యమాన్యం, మాజీ సీఎం జగన్ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

నిరుద్యోగ రహిత రాష్ట్రమే ప్రభుత్వ లక్ష్యం

నాయుడుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట డిగ్రీ కళాశాలలో మంగళవారం వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు ఉన్నాయన్నారు. ఇందులో భాగంగా ప్రతి మూడు నెలలకొకసారి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. కాగా, మొత్తం 128 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మధుసూదన్‌వర్మ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, అవధానం సుధీర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గరుడోత్సవం



స్వామివారికి మాఢవీధి ఉత్సవం నిర్వహిస్తున్న భక్తులు

గూడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. ఉదయం స్వామివారిని మోహినీ అలంకారంలో ఉంచి మాడవీధి ఉత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన గరుడవాహనంపై ఉంచి మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకంటి రామమోహన్‌రావు, ఈవో రవికృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ఓజిలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఓజిలిలోని గ్రామదేవత పోలేరమ్మకు మంగళవారం అంబలి పొంగళ్లు పెట్టారు. దేవాలయం నిర్మించి మూడేళ్లు పూర్తయిన నేపథ్యంలో గ్రామస్తులు దేవాలయం వద్ద పూజలు చేశారు. అమ్మవారిని తీర్చిదిద్ది కొబ్బరికాయలు కొట్టి పెద్ద మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ బడిబాట

ఓజిలి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం అంగన్‌వాడీ బడిబాట - పిల్లలకు పూలబాట కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారం, తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఓజిలిలో జరిగిన కార్యక్రమంలో కార్యకర్తలు శ్యామల, సహాయకురాలు బంగారమ్మ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నాయుడుపేట టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మంగళవారం ఉదయం 9.00నుంచి మధ్యాహ్నం వరకు కంటి పరీక్షలు నిర్వహించారు. 64మందికి ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు ఎంపిక చేశారు. 70 మందికి కళ్ల అద్దాలు, 100 మందికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భవానీ, ట్రస్టు ఏవో గల్లా కృష్ణ, అరవింద్ నేత్రాలయ సిబ్బంది దిలీప్, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బదిలీ అయిన అధికారులకు సన్మానం

సూళ్లూరుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ శాఖలో పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న వ్యవసాయ సహాయ సంచాలకురాలు జి.అనిత, ఏవో కవిత, సిబ్బంది చిరంజీవి, కృష్ణవేణిలను మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పెస్టిసైడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ సీడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వాకచర్ల రమేష్, మెల్లకంట శ్రీనివాసులు, మునెయ్య, బాలాజి, శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయాధికారులను సన్మానిస్తున్న ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ నేతలు

కారు ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలోని భూపయ్య కాలనీ వద్ద కారు ఢీకొనడంతో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. భూపయ్యకాలనీలో నివాసం ఉంటున్న బుజ్జమ్మ మంగళవారం రాత్రి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుత్తుండగా నెల్లూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన బుజ్జమ్మను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

నేటినుంచి గిరిజనులకు ఆధార్ సేవలు

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చెందోడులో ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు గిరిజనుల కోసం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్ తెలిపారు. బుధవారం చెందోడులో స్పెషల్ క్యాంప్ నిర్వహించి చెందోడు, చిట్టేడు, గూడలి-1, గూడలి-2, కేశవరం సచివాలయ పరిధిలోని గ్రామాల్లోని గిరిజనులకు ఉచితంగా ఆధార్ సేవలు అందించడం జరుగుతుందన్నారు. అదే విధంగా 13వ తేదీన కొక్కుపాడు, నెల్లూరుపల్లి కొత్తపాళెం గ్రామాల్లోని గిరిజనుల కోసం కొక్కుపాడులో స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు.

నేడు అభివృద్ధి పనుల ప్రారంభం

పెళ్లకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు, పాలచ్చూరు పంచాయతీల్లో సిమెంట్ రోడ్లతో పాటు పలు అభివృద్ధి పలు అభివృద్ధి పనులను సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ బుధవారం ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు.





సూళ్లూరుపేట పోలీసుస్టేషన్, క్వార్టర్స్ ఆవరణలో తుప్పు పడుతున్న వాహనాలు

పట్టుబడితే... తుప్పు పట్టాల్సిందే!

పోలీసుస్టేషన్లలో మగ్గిపోతున్న వాహనాలు

సూళ్లూరుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు వాహనాలు పట్టుబడితే తుప్పుపట్టి భూమిలో కరిగిపోవాల్సిందే.. ఖరీదైన కార్లు, వ్యాన్లు, ఆటోలు, మోటారు సైకిళ్లు.. ఇలా ఏ వాహనమైనా సరే పోలీసులకు చిక్కితే అంతే సంగతి. సూళ్లూరుపేట పోలీసుస్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలు పేరుకుపోతున్నాయి. స్టేషన్ ఆవరణలో స్థలం సరిపోక పోలీస్ క్వార్టర్స్ స్థలంలో పార్కింగ్ చేస్తున్నారు. అవి ఎండకు ఎండి.. వానకు తడిచి పనికిరాకుండా పోతున్నాయి.

కేసులు తేలక కొన్ని...

ప్రమాదాలకు గురైన వాహనాలు ఏళ్ల తరబడి కేసులు పూర్తికాక పోలీస్‌స్టేషన్ల ఆవరణలో ఉండిపోతున్నాయి. వాహన యజమానులకు జరిమానా విధించిన సందర్భాల్లో రుసుం చెల్లించి వాహనాలు తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే అప్పటికే వాహనం తుప్పుపట్టిపోవడంతో పాటు ప్రమాదాలకు గురైన వాహనాలను తిరిగి తీసుకువెళ్లేందుకు చాలామంది యజమానులు ఆసక్తి చూపడం లేదు. గంజాయి, మద్యం, ఎర్రచందనం అక్రమ రవాణా, చోరీ కేసుల్లో పట్టుబడిన వాహనాలదీ ఇదే పరిస్థితి. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం, పెళ్లకూరు, ఓజిలి మండలాల్లో అధికంగా పట్టుబడిన వాహనాలు తుప్పుపట్టి మట్టిలో కూరుకుపోయి ఉన్నాయి. ఇదిలా ఉండగా ఆ వాహనాల్లోని బ్యాటరీలు, హారన్లు, ఇంజన్‌లోని విలువైన పరికరాలతో పాటు ఇతరత్రా మెటీరియల్ మాయం అవుతున్నాయన్న ఆరోపణలూ లేకపోలేదు.

వేలం వేయాల్సి ఉన్నా..

నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్న, చోరీ కేసుల్లో పోలీసులకు చిక్కిన వాహనాలను స్టేషన్‌కు తరలిస్తారు. వాటిని సీజ్‌చేసి రెవెన్యూ అధికారులకు సమాచారమిస్తారు. బహిరంగ ప్రకటన విడుదల చేసి ఆరు నెలల అనంతరం వేలం వేస్తారు. ఎక్సైజ్ కేసుల్లో సారా, అక్రమ మద్యం రవాణాకు సంబంధించి ఎప్పటికప్పుడు వాహనాలను వేలం వేస్తున్నారు. కానీ పోలీసు శాఖకు సంబంధించి వాహనాలను వేలం వేయడం లేదు. దీంతో స్టేషన్లలోనే పేరుకుపోయి తుప్పుపట్టిపోతున్నాయి.

సాక్షి మీడియాను నిషేధించాలి: పాశిం సంధ్యారాణి



గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ వద్ద సాక్షి దినపత్రికలను, మాజీ సీఎం జగన్ ఫ్లెక్సీలను దహనం చేస్తున్న తెలుగుమహిళలు

గూడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానించడమే కాకుండా వారి మనోభావాలను దెబ్బతీసేలా కథనాలను ప్రసారం చేసిన సాక్షి మీడియాను నిషేధించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి పాశిం సంధ్యారాణి అన్నారు. మంగళ వారం గూడూరు పట్టణం వివేకానంద రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వివేకానంద రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, ముత్యాలపేట మీదుగా టవర్‌క్లాక్ సెంటర్ వరకు తెలుగు మహిళల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. టవర్‌క్లాక్ సెంటర్ వద్ద మాజీ సీఎం జగన్, భారతిరెడ్డి, జర్నలిస్టులు శ్రీనివాసరావు, కృష్ణంరాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాక్షి దినపత్రికలను, జగన్ చిత్రపటాలను దహనం చేశారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ సాక్షి మీడియాలో రాజధాని అమరావతి మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన జర్నలిస్టులు సభ్యసమాజం తలదించుకునేలా మహిళల పట్ల అసభ్యకరంగా మాట్లాడడం మంచిపద్ధతి కాదన్నారు. ఇటువంటి చర్యలను మాజీ సీఎం జగన్, భారతిరెడ్డి ఖండించకపోవడం మహిళల పట్ల వారికున్న చులకన భావాన్ని రుజువు చేస్తోందన్నారు. మహిళల పట్ల అగౌరవంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుని అమరావతి రాజధాని మహిళలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, రాష్ట్ర కార్యదర్శి గుండాల లీలావతి, శ్రీదేవి, భారతి, సుప్రజ, శైలజ, కల్పన, ప్రమీల, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంగా అభివృద్ధి: విజయశ్రీ



పట్టణంలోని బేరిపేటలో డ్రైనేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు

నాయుడుపేట టౌన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంతో రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట పట్టణంలోని బేరిపేట, రజకకాలనీలో మంగళవారం ఉదయం 'గుడ్ మార్నింగ్' కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యంతో కలసి పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొన్ని ప్రాంతాలలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో చర్యలు చేపట్టాలని మున్సిపాలిటీ అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను నేరుగా వెళ్లి తెలుసుకొని పరిష్కరించడం కోసం గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వార్డుల్లో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఫజులుల్లా, తహసీల్దారు రాజేంద్ర, టీడీపీ నాయకులు రఫీ, నెలవల రాజేష్, గంగాప్రసాద్, అవధానం సుధీర్, చెవూరి చెంగయ్య, పొట్లపూడి రాజేష్, సుబ్బారావు, నారాయణ, నిత్యకృష్ణారెడ్డి, మస్తాన్, లక్ష్మయ్య, సుబ్రహ్మణ్యం, బాబు, శోభన్‌నాయుడు పాల్గొన్నారు.

బాలికల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): బాలికల పట్ల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకొన్నప్పుడే క్రమశిక్షణతో కలిగిన నడవడిక అలవడుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక పింజలవీరయ్య కల్యాణ మండపంలో జరిగిన కిషోర వికాస వేసవి శిక్షణ ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. సెల్ ఫోన్లను సద్వినియోగం చేసుకుటే ఎంత ప్రయోజనం ఉంటుందో దుర్వినియోగం చేస్తే అంతే దుష్పరిణామాలు ఉంటాయన్నారు. పౌష్టికాహారం వల్ల కలిగే లాభాలు, బాల్య వివాహల నిర్మూలన, చట్టాలపై అవగాహన కల్పించారు. పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి బహుమతులు అందించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పౌష్టికాహారం సంబంధించి స్టాళ్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తనుజారెడ్డి, ఐసీడీఎస్ పీడీ వసంత బాయ్, సీఐ రమణ, ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, సీడీపీవో షంషాద్ బేగం, టీడీపీ నాయకుడు మంకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు

కోలాహలంగా నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు





నాయుడుపేట, గూడూరు, సూళ్లూరుపేటలో కేక్ కట్‌చేస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): సినీహీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. గూడూరు డివిజన్ బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని ఆయన నివాసంలో కేక్ కట్‌చేశారు. పాదర్తి ప్రకాష్ నాయుడు, చిరువెళ్ల మునిరాజు, ఆళ్ల రాజారెడ్డి, అత్తికాయల సుబ్రహ్మణ్యం, వాకిరి వెంకటే శ్వర్లు, దాసరి వెంకటేశ్వర్లు, మహదేవనాయుడు, సుబ్రహ్మణ్యం, నరసింహ నాయుడు, సిరాజ్, ఖలీల్, కిషోర్, రహమాన్, రఫీ, బాబు, చరణ్ పాల్గొన్నారు.

గూడూరు: పట్టనంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, తూపిలి సురేంద్ర, శివకుమార్, దయాకర్, పార్వతయ్య, వెంకటేశ్వర్లు, భారతి, సందీప్ పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని రైల్వేగేటు వద్దనున్న టీడీపీ కార్యాలయంలో నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. టీడీపీ సుధాకర్‌రెడ్డి, ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, మాధవనాయుడు, అలవల శ్రీనివాసులు, వాకచర్ల రమేష్, సురేష్ నాయుడు, అలీ భాయ్ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 20నుంచి 29వ తేదీ వరకు ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు, తిరుపతి, గుంటూరు, ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాల నుంచి 650 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లు శిక్షణ శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. ఎన్‌సీసీ క్యాంప్‌లో డ్రిల్, షిప్ మోడరింగ్, ట్రెకింగ్, బ్లడ్ డొనేషన్, ఫైర్ ఫైటింగ్, రిగ్గింగ్, యోగా తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ భవన్‌లో మంగళవారం పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి జీజీ నాయుడు, రవికుమార్, శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో డ్రోన్ సర్వే

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్రతీర ప్రాంత గ్రామాలైన సిద్దవరం, కర్లపూడిలో మంగళవారం భూముల డ్రోన్ సర్వే నిర్వహించారు. రెండురోజులుగా ఆయా పంచాయతీల్లో తహసీల్దారు జయజయరావు, మండల సర్వేయర్ జ్యోతిరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో శ్రీనివాసులు, విలేజ్ సర్వేయర్ల ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే జరుగుతున్న సంగతి తెలిసిందే. ఆయా పంచాయతీల్లో ఇప్పటి వరకు 1575 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించారు.

ఐటీఐకి కంప్యూటర్ పరికరాల అందజేత

వాకాడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐటీఐకి శ్రీసిటీ ఆధ్వర్యంలో అప్రోటెక్ స్టీల్ కంపెనీ ఏఎండీ జైసన్‌జోసెఫ్ దాతృత్వంతో రూ.10 లక్షలు విలువ చేసే కంప్యూటర్ పరికరాలను మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవికి అందజేశారు. అప్రోటెక్ స్టీల్ కంపెనీ ప్రతినిధులను ఐటీఐ ప్రిన్సిపాల్ సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అప్రోటెక్ కంపెనీ ఎండీ అరుణ్‌మిరండా పాల్గొన్నారు.

సహకార బ్యాంకులో బదిలీలు

గూడూరు అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ)లో స్థాన చలనాలు ప్రారంభమయ్యాయి. మూడేళ్లకు పైగా ఒకేచోట పనిచేస్తున్న 33మంది ఉద్యోగులకు మంగళవారం బదిలీ ఉత్తర్వులు అందాయి. ఇందులో తిరుపతి జిల్లా పరిధిలో 11 మంది ఉద్యోగులను బదిలీ చేస్తూ ఎన్‌డీసీసీబీ సీఈవో శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు బ్యాంకు చీఫ్ మేనేజర్ సత్యవతి నాయుడుపేటకు, నాయుడుపేట నుంచి హరికృష్ణ కుమార్ గూడూరుకు బదిలీ అయ్యారు. నెల్లూరు ప్రధాన శాఖలోని జీ.వెంకట్ వెంకటగిరికి, అక్కడి చీఫ్ మేనేజర్ టీ.రాజా సూళ్లూరుపేటకు బదిలీ అయ్యారు. కాగా, సూళ్లూరుపేటలోని వీ.శ్రీనివాసమూర్తి నెల్లూరు డీఆర్ ఓఎస్‌డీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. వెంకటగిరి బ్రాంచ్ మేనేజర్ ఏ.ఫణీంద్రబాబు ఇదే కార్యాలయానికి బదిలీ ఉత్తర్వులు అందుకున్నారు.

ఆరుగురు అసిస్టెంట్ మేనేజర్ల బదిలీ

నాయుడుపేట బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ చెంగయ్య బదిలీపై గూడూరుకు రానున్నారు. ఇక్కడున్న ఐ.గురునాథం వెంకటగిరికి బదిలీ అయ్యారు. మరో అసిస్టెంట్ మేనేజర్ వి.దేవసేన నెల్లూరు ప్రధాన బ్యాంకుకు వెళ్లనున్నారు. అలాగే షేక్ చంద్‌బాషా వాకాడు నుంచి సూళ్లూరుపేటకు, షేక్ షర్మీలాబేగం కోట నుంచి నెల్లూరు ప్రధాన బ్యాంకుకు బదిలీ అయ్యారు. అలాగే గూడూరు బ్యాంకులో ఆర్.పద్మ కోట బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. వి సుకుమార్(ఎస్‌ఏ) వెంకటగిరి నుంచి కోటకు బదిలీ అయ్యారు. నెల్లూరు కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా మెట్టుకూరి ధనుంజయరెడ్డి పగ్గాలు చేపట్టిన రెండు రోజుల్లోనే భారీగా బదిలీలు చేపట్టడం చర్చనీయాంశమైంది.

క్రీడలతో ఆత్మవిశ్వాసం



తైక్వాండో సాధన చేస్తున్న విద్యార్థులు

నాయుడుపేట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, టీడీపీ యువ నేత నెలవల రాజేష్ అన్నారు. నాయుడుపేట అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన తైక్వాండో వేసవి శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. జూలై 25 నుంచి 27 వరకు విజయవాడలో జరగనున్న ఓపెన్ నేషనల్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలకు క్రీడాకారులు సిద్ధంగా ఉన్నారని కోచ్ పవన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్‌లు ఎ.వినోద్‌కుమార్, నవీన్, లక్ష్మీప్రభ, అస్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి



కూటమి నాయకులు, కార్యకర్తలతో టీడీపీ నాయకుడు తానంకి నానాజీ

చిల్లకూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఈనెల 12వ తేదీన గూడూరులో నిర్వహించనున్న విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకులు తానంకి నానాజీ అన్నారు. మంగళవారం చిల్లకూరులోని ఆయన నివాసంలో కూటమి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. 12న గూడూరు సంగం థియేటర్ సమీపంలోని వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి టవర్ క్లాక్ సెంటర్ వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ తరలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభి రామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రాము, నెల్లూరు రామ్మూర్తి, బెల్లంకొండ శివ, కాటూరు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయండి

గూడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఇస్కాన్ ఆధ్వర్యంలో జూలై 5వ తేదీ నిర్వహించనున్న జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలని ఇస్కాన్ ప్రతినిధి సుఖదేవస్వామి అన్నారు. మంగళవారం పోటుపాళెంలోని లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో జగన్నాథ రథయాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో బలభద్ర గోపదాసుప్రభు, పీఎం రావు, లక్ష్మి, రాజా, మయూరి శ్యామ్‌యాదవ్, మల్లయ్య పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



చందన అలంకారంలో గంగమ్మ

గూడూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజావీధిలోని గంగమ్మ పరమేశ్వరిదేవి ఆలయంలో వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని చందనంతో అలంకరించి పూజలు జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా పాండురంగస్వామి ఉత్సవాలు

దొరవారిసత్రం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం బుదూరు గ్రామంలోని రుక్మిణీ సమేత పాండురంగ స్వామి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో రెండో రోజు మంగళవారం రాత్రి అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు దీక్ష మాలతో అగ్నిగుండ ప్రవేశం చేశారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, టీటీడీ మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి పాండురంగ స్వామి పూజల్లో పాల్గొన్నారు.